

ఆదివారం ప్రత్యేకం

కర్రసాము పట్ల ప్రస్తుతం బాలికలు, యువతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడుతుందని తల్లిదండ్రులు కూడా అందుకు ప్రోత్సహిస్తున్నారు. కొందరైతే కర్రసాములో నైపుణ్యం పెంచుకోవడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలో పాల్గొని పతకాలను కొల్లగొడుతున్నారు.

ఆత్మరక్షణకు కర్రసాము



కత్తితో దాడి చేయబోతున్న యువకుడిని కర్రతో అడ్డుకుంటున్న యువతి

శిక్షణపై బాలికలు, యువతుల్లో పెరుగుతున్న ఆసక్తి

ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

- ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పెరగడానికి దోహదం
- బరువు తగ్గడంతోపాటు కీళ్లు, ఎముకల పటుత్వం, ఏకాగ్రత మెరుగుపడేందుకు అవకాశం
- నగరంలో పెరుగుతున్న కేంద్రాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కర్రసాముకు పురాతన చరిత్ర ఉంది. భారతదేశంలో క్రీస్తుపూర్వం నుంచి కర్రసాము ఉనికి ఉంది. అప్పటి ప్రజలు ప్రత్యర్థుల దాడులను తిప్పికొట్టేందుకు, జంతువుల దాడి నుంచి రక్షణకు కర్రసాము నేర్చుకునేవారు. కర్రసాముతో బరువు తగ్గడంతోపాటు కీళ్ల, ఎముకల పటుత్వం, ఏకాగ్రత పెరుగుతాయి. అలాగే రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. అనుకోని అపాయం ఎదురైతే సమర్థంగా ఎదుర్కొనగలమనే ఆత్మవిశ్వాసం కూడా కలుగుతుంది. అందుకే కొన్ని దశాబ్దాల కిందటి వరకూ కర్రసాముకు విశేషమైన ప్రాచుర్యం, ఆదరణ ఉండేవి. గ్రామాలు, పట్టణాల్లో కర్రసాము పోటీలు జరుగుతుండేవి. జాతరలు, పండుగలు జరిగితే కర్రసాము ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కాలక్రమేణా కర్రసాము మరుగున పడిపోయింది. ఇటీవల కాలంలో తిరిగి కర్రసాము పట్ల యువత ఆసక్తిచూపడం మొదలుపెట్టారు. కర్రసాము వ్యాయామంగా కూడా ఉపయోగపడుతుందని గుర్తిస్తున్నారు. పురుషులతో సమానంగా బాలికలు, యువతులు

... మిగతా 6వ పేజీలో

ఆత్మరక్షణకు ఎంతో అవసరం



నేను మూడేళ్ల కిందట వ్యాయామంలో భాగంగా వాకింగ్ కోసం సెంట్రల్‌పార్కుకి వచ్చాను. అప్పుడు కర్రసాములో శిక్షణ ఇస్తుండడం చూసి ఆసక్తితో నేర్చుకోవడం ప్రారంభించాను. బాలికలు, యువతులతోపాటు మహిళలపై దాడులు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఆత్మరక్షణకు కర్రసాము నేర్చుకోవడం చాలా అవసరం. కర్రసాము నేర్చుకుంటే ఎలాంటి వారినైనా మట్టి కరిపించవచ్చు. కర్రసాములో నైపుణ్యం సాధిస్తే ఒకవైపు ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశాసం పెరుగుతుంది. భవిష్యత్తులో నేను ఆడపిల్లలకు కర్రసాములో శిక్షణ ఇస్తాను. - పి.సంధ్య, ఎంబీఏ విద్యార్థిని



వీఎంఆర్‌డీఏ పార్కులో కర్రసాము సాధన

ఉద్యోగుల ఫండ్‌కు ఉక్కు ఎసరు!

లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్/ రిటైర్‌మెంట్ సెటిల్‌మెంట్ ఫండ్ నుంచి రూ.390 కోట్లు విత్‌డ్రా

- ఏకపక్షంగా యాజమాన్యం నిర్ణయం
- కార్మికుల ఆగ్రహం

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ముడి పదార్థాల కొనుగోలుకు నిధులు కొరత ఏర్పడడంతో ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పదవీ విరమణ చేసినప్పుడు సెటిల్‌మెంట్ చేయడానికి ఏర్పాటు చేసుకున్న నిధుల నుంచి రూ.390 కోట్లు వాడేసుకుంది. ఆ ఫండ్‌లో మొత్తం రూ.609 కోట్లు ఉండాలని, కానీ రూ.219 కోట్లు మాత్రమే ఉన్నాయని కార్మిక సంఘ నాయకులు ఆలస్యంగా గుర్తించారు. మిగిలిన నిధులు ఏమయ్యాయని ఆరా తీస్తే...యాజమాన్యమే వాడేసుకుందని తెలియడంతో హతాశులయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి ఉద్యోగులు తమ జీతాల నుంచి ప్రతి నెలా కొంత మొత్తం ఈ ఫండ్‌కు జమ చేస్తూ వస్తున్నారు. వీటిని ఉద్యోగుల సెటిల్‌మెంట్‌కు తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించడానికి నిబంధనలు అంగీకరించవు. కానీ ఎవరినీ సంప్రతించకుండా, చర్చించకుండా యాజమాన్యం ఏకపక్షంగా భారీగా నిధులు వాడేసుకోవడంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఏడాది మే నెల నుంచి రిటైరైన వారికి బెనిఫిట్స్ ఏమీ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టేశారు. ఆయా కుటుంబాలు వచ్చి ఆర్థిక విభాగంలో అడుగుతున్నా పట్టించుకోవడం లేదు.



ఢిల్లీ నుంచి అనుమతులు వస్తే తప్ప ఇవ్వలేమని బుకాయిస్తున్నారు. నిధులను అడ్డగోలుగా వాడేసుకోవడం వల్లనే ఇలా చేస్తున్నారనే విషయం బయటకు పొక్కడంతో స్టీల్ ప్లాంటు గుర్తింపు యూనియన్ సీఎండీకి శనివారం ఘాటుగా లేఖ రాసింది. ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ /రిటైర్‌మెంట్ సెటిల్‌మెంట్ ఫండ్ నుంచి రూ.390 కోట్లు విత్‌డ్రా చేశారని, ఇది ఎవరి నిర్ణయమో వెల్లడించాలని కోరింది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని ప్రస్తుత తరుణంలో ఇలాంటి చర్యలు అభద్రతా భావాన్ని పెంచుతాయని పేర్కొంది.

చట్టబద్ధ చెల్లింపులకు మరో రూ.900 కోట్లు

ఉద్యోగులకు సంబంధించి వివిధ పద్దుల కింద జమ చేయాల్సిన మొత్తం రూ.900 కోట్లకు చేరిందని, వీటి విషయంలోను తక్షణమే తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎండీని గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కేఎస్ఎన్ రావు కోరారు. ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్‌కు రూ.400 కోట్లు, సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్‌కు రూ.325 కోట్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు రూ.65 కోట్లు, అనారోగ్యానికి గురైన ఉద్యోగుల కుటుంబాలకు రూ.40 కోట్లు, వీఎస్‌పీ థ్రిఫ్ట్ సొసైటీకి రూ.70 కోట్లు యాజమాన్యం చెల్లించాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ పథకాల కింద ప్రతి నెలా ఉద్యోగుల జీతాల నుంచి కోత విధిస్తూ ఆయా మొత్తాలను సదరు పద్దులకు జమ చేయకపోవడం వల్ల బకాయిలు రూ.900 కోట్లకు చేరాయని, ఇది కూడా అన్యాయమని ఆరోపించారు. వీటన్నింటిపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నందున తక్షణమే వాడుకున్న రూ.390 కోట్లు తిరిగి జమ చేయాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫటా..ఫట్

అందరూ అడిగారనే అధ్యయన యాత్రకు...

- జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



ప్రశ్న: కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు చట్టంలో అనుమతి ఉందా?

మేయర్: గత కొన్నేళ్లుగా అధ్యయన యాత్రకు వెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో రెండుసార్లు వెళ్లారు. ఇప్పుడు మరోసారి వెళుతున్నారు.

ప్రశ్న: చట్టంలో లేనప్పుడు ఎందుకు అనుమతి ఇచ్చారు?

మేయర్: యాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వైసీపీ, టీడీపీ, జనసేన ఫ్లోర్‌లీడర్లు నాకు లేఖలు ఇచ్చారు. కమిషనర్ కూడా యాత్రకు అనుమతి ఇవ్వాలని లేఖ ద్వారా కోరారు. అందరి అభ్యర్థన మేరకు అనుమతిచ్చాను.

ప్రశ్న: గత రెండు అధ్యయన యాత్రల్లో గుర్తించి అమలుచేసినవేమైనా ఉన్నాయా?

మేయర్: ఆగ్రా, జమ్మూలో చెత్త శాస్త్రీయ నిర్వహణ విధానం బాగుందని గుర్తించాం. కానీ వేర్వేరు కారణాల వల్ల వాటిని నగరంలో ఇంతవరకూ అమలుచేయడం సాధ్యపడలేదు.

ప్రశ్న: అధ్యయన యాత్ర పేరుతో బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలపై మీ స్పందన?

మేయర్: ప్రతి కార్పొరేటర్‌కు జీవీఎంసీ నిధుల నుంచి రూ.1.19 లక్షలు వెచ్చించేందుకు టెండర్ పిలిచాం. అదనపు వసూళ్లకు పాల్పడాల్సిన అవసరం లేదు.

ఈడీ అలజడి

- మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు
- ఏకకాలంలో ఐదుచోట్ల...
- రాత్రి పది గంటలు దాటిన తరువాత కూడా కొనసాగింపు
- వైసీపీ నేతల్లో గుబులు



మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):

వైసీపీకి చెందిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన స్నేహితుడు, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. ఈడీ అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ ఇల్లు, కార్యాలయంతోపాటు రుషికొండలోని ఆయన కుమారుడు ఉంటున్న ఇల్లు, సీతమ్మధారలోని జీవీ నివాసం, పెదవాల్తేరులోని అతని కార్యాలయంలో ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. ఇవి రాత్రి పది గంటలకూ కూడా కొనసాగుతున్నాయి.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంవీవీ, జీవీ బలవంతంగా తన వద్ద భూములు లాక్కొన్నారని, ఆ భూమి వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిపారనే హయగ్రీవ సంస్థ ప్రమోటర్ అయిన చెరుకూరి జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఈడీ అధికారులు సోదాలు చేసినట్టు నగరంలో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా వైసీపీకి చెందిన ఎంవీవీ సత్యనారాయణ, జీవీల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు జరపడం ఆ పార్టీ నేతల్లో చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో కొంతమంది నేతలు ఉమ్మడి జిల్లాలో భారీగా అక్రమాలు, దందాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన సమాచారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉందని, ఏ క్షణంలో ఏమైనా జరగవచ్చుననే ఆందోళన వైసీపీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఇదిలావుండగా ఈడీ అధికారులు రెండు రోజుల కిందటే నగరానికి చేరుకున్నట్టు సమాచారం. శుక్రవారం ఎంవీవీ ఇల్లు, కార్యాలయం, రుషికొండలోని అతని కుమారుడు నివాసం ఉంటున్న ఇల్లుతోపాటు జీవీకి చెందిన ఇల్లు, కార్యాలయాల వద్ద అధికారులు రెక్కీ నిర్వహించినట్టు కొంతమంది

... మిగతా 6వ పేజీలో

అశ్రద్ధ చేస్తే ఆరోగ్యం గుల్ల



- చిన్నవయసులోనే గుల్లబారుతున్న ఎముకలు
- కొందరిలో జన్యుపరమైన కారణాలతో సమస్య...
- నేడు అంతర్జాతీయ ఆస్టియో పోరోసిస్ డే

... 8లో

వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నవజాత శిశువు మృతి



- గైనిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడమే కారణం ... వార్త 6లో

రెండో రోజూ ప్రజాదర్బార్

- వినతలు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్
- తమను క్రమబద్ధీకరించాలని కోరిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు
- వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలని కోరిన నాయీ బ్రాహ్మణులు
- అనంతరం అక్కయ్యపాలెం ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం కూడా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

మా పాలిట దేవుడవయ్యా..

ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ కుమారుడిని పోలీసుల సాయంతో తమకు అప్పగించిన లోకేశ్‌కు విజయనగరం జిల్లా సంతకవిటి మండలం బొద్దూరుకు చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాలిట దేవుడువంటూ కొనియాడారు. నిరుపేద కుటుంబం కావడంతో ఉపాధికి సాయపడాలని కోరగా...అందుకు లోకేశ్ హామీ ఇచ్చారు. కూలిపనులు చేసుకునే వేణుగోపాలరావు దంపతులకు ముగ్గురు కుమారులు. బంధువుల ఇంట్లో

... మిగతా 6వ పేజీలో



గ్రంథాలయాన్ని సమయానికి తెరవకపోవడంపై ప్రశ్నిస్తున్న మంత్రి నారా లోకేశ్

హోటళ్లన్నీ ఫుల్

- ఒకపక్క పర్యాటకులు
- మరొకపక్క పెళ్లిళ్లు
- వైద్యుల సదస్సుకు 2,500 రూమ్‌లు రిజర్వు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరం అతిథులతో కళకళలాడుతోంది. హోటళ్లన్నీ ఫుల్ అయిపోయాయి. కొత్తగా ఎవరైనా నగరంలోకి వచ్చినా, సమావేశం ఏర్పాటు చేసుకుందామని యత్నించినా స్టార్ హోటళ్లలో రూమ్‌లు, హాళ్లు లభించడం లేదు. ఇది పూర్తిగా పర్యాటక సీజన్. దసరా నుంచి విశాఖకు పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారు. విశాఖలో రెండు, మూడు రోజులు గడిపి తరువాత ఏజెన్సీకి వెళుతుంటారు. పర్యాటక శాఖకు సంబంధించి నగరంలో ఎటువంటి వసతి లేకపోవడంతో



అంతా ప్రైవేటు హోటళ్లనే ఆశ్రయిస్తున్నారు. వీరు కాకుండా విశాఖకు రెగ్యులర్‌గా వ్యాపార, ఉద్యోగ వ్యవహారాలపై వచ్చేవారు ఉంటారు. ఇక గత వారం రోజులుగా వివిధ శుభకార్యాలకు హాజరు కావడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి సంఖ్య బాగా పెరిగింది.

వైద్యుల సదస్సుతో బిజీ

నగరంలో ఈ నెల 16న న్యూరాలజీ జాతీయ సదస్సు-2024 మొదలైంది. ఐదు రోజులు

... మిగతా 6వ పేజీలో

కేకే లైనులో డీఆర్ఎం విస్తృత తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కోరాపుట్-రాయగడ లైనులో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శనివారం పర్యటించి డబుల్ లైను నిర్మాణ పనులు, ప్రయాణికుల సౌకర్యాలు, అమృత్ భారత్ పథకం నిర్మాణ పనుల పురోగతిపై తనిఖీలు చేశారు. రెండు రోజులు కొనసాగిన ఈ పర్యటనలో ముందుగా కొత్తవలస-కోరాపుట్ సెక్షన్‌లోని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా నిర్వహణ కార్యకలాపాలను పరిశీలించి గేట్‌మెన్లతో కొద్దిసేపు మాట్లాడి పనుల నైపుణ్యాన్ని పరీక్షించారు. అనంతరం దమన్‌జోడి, కోరాపుట్ స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన 12 మీటర్ల వెడల్పు పాదచారుల వంతెన, స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. విండో ట్రైలింగ్ ద్వారా వివిధ స్టేషన్లలోని మౌలిక సదుపాయాలు, డబుల్ లైను నిర్మాణ పనుల పురోగతి, భద్రతా ప్రమాణాల నిర్వహణపై తనిఖీ చేశారు. ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘోషా ఆసుపత్రిలో వసతుల కల్పనకు చర్యలు

జగదాంబ కూడలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రిలో గర్భిణులు, వారి సహాయకుల కోసం వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్ వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్‌ఫెక్షన్ ప్రివెంట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. పోర్టు అథారిటీ ఆర్థిక సాయంతో ఆర్వో ప్లాంట్, డీఎంఈ నిధులతో హైఓల్టేజ్ జనరేటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గర్భిణుల సౌలభ్యం కోసం రూ.40 లక్షల వ్యయంతో లిఫ్ట్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. ఆసుపత్రి భవనాల ఆధునికీకరణ కోసం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ద్వారా డీఎంఈకి ప్రతిపాదనలు పంపామన్నారు. కొన్నిఉద్యోగ ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు పంపామన్నారు.

ఆరోగ్య కేంద్రంలో సమస్యల పరిష్కారానికి హామీ

అల్లిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్యకేంద్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. శనివారం భీమ్‌నగర్ ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బంది, రోగుల పట్ల ఆకతాయిలు అసభ్యంగా వ్యవహరిస్తున్నారని, తాగునీటి సమస్య ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే బోరు ఏర్పాటు చేస్తానన్నారు. ఆకతాయిల ఆగడాలు అరికట్టడానికి పోలీసు అధికారులకు చెబుతానన్నారు.

ఉపాధ్యాయుల బోధన తీరుపై అధికారి ఆరా

అక్కయ్యపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి డి.రవీంద్రబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరుపై విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై మంచి భవిష్యత్తును రూపొందించుకోవాలని హితవు పలికారు. ఎంఈవోలు రామారావు, బాలామణి, సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నప్రసాద వితరణ

అక్కయ్యపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎరుమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పోర్టు ఆసుపత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మాల ధరించిన స్వాములకు శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన రామాచార్యులు దీన్ని ప్రారంభించారు. డిసెంబరు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

'ప్రజలపై విద్యుత్ భారం వద్దు'

జ్ఞానాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడు నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఈ విషయమై శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రజలపై భారాలు మోపవద్దని అన్నారు. కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి స్మార్టు మీటర్ల ఏర్పాటు ద్వారా రూ.17 వేల కోట్లు రాబట్టడానికి ప్రయత్నిస్తోందని అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయం మారకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని స్పష్టంచేశారు.

'అప్రమత్తంగా ఉండండి'

అల్లిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, రానున్న తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. కలెక్టరు, జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం జోన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పూడికలు తొలగించేందుకు తగినంత యంత్రసామగ్రి ఉంచుకుని, పారిశుధ్య కార్మికులను చైతన్యపరచాలని సూచించారు. ముంపు, కొండ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పాత భవనాలను గుర్తించి తక్షణమే నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఈఈ మురళీకృష్ణ, ఏఎంహెచ్ఓ కృష్ణంరాజు, పారిశుధ్య పర్యవేక్షకులు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.



ఇన్‌కమ్‌టాక్స్ కార్యాలయం రోడ్డులో నిలిపిన లోడింగ్ ఆటోలు



ప్రేమ సమాజం రోడ్డులో ఇలా..

ఆక్రమణలకు అడ్డాగా డాబాగార్డెన్స్

డాబాగార్డెన్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రోడ్డు కనిపిస్తే చాలు...అక్కడ ఒక బడ్డీనో, లేదా..ఇష్టానుసారంగా లోడింగ్ చేసే ఆటోలను పదుల సంఖ్యలో నిలిపేస్తున్నారు. దీంతో డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డు, రంగాస్ట్రీట్, పెన్ స్కూల్, ఇన్‌కమ్ టాక్స్ రోడ్డు, ప్రేమ సమాజం రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ అనేక ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండటంతో సమస్య మరింత జటిలంగా తయారైంది. గంటలకొద్దీ భారీ వాహనాలు రోడ్డుపైనే ఉంచేయడంతో ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నిత్యకృత్యమైంది. దీంతో పాటుగా ఇన్‌కమ్‌టాక్స్ కార్యాలయం ఎదురుగా పెన్‌స్కూల్‌కు ఆనుకుని ఏకంగా కాలువపైనే పెద్ద బడ్డీ పెట్టేశారు. మరి కొద్ది దూరంలోనే పదుల సంఖ్యలో లోడింగ్‌కు సంబంధించి ఆటోలు పార్కింగ్ చేయడం... కొంత దూరంలోనే భవన నిర్మాణ సామగ్రికి చెందిన ఆటోలను నిలుపుదల చేసేయడంతో అసలు అటుగా రాకపోకలు సాగించేవారంతా తలలు పట్టుకుంటున్నారు. సాయంత్రం, ఉదయం వేళల్లో నలువైపులా రాకపోకలు సాగించేలా ఇక్కడ రోడ్లు ఉంటాయి. ఎక్కువ సంఖ్యలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో రోడ్డుమధ్యనే నడవాల్సి వస్తోంది. కూతవేటు దూరంలోనే టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ఈ సమస్య పట్టించుకోకపోవడం గమనార్హం.

డ్రైవ్ చేపడతాం..

ఇప్పటికే వార్డులో పలుమార్లు డ్రైవ్ చేపట్టాం. అయితే ఇదే విషయాన్ని ఏసీపీ దృష్టికి కూడా తీసుకెళతా. కొన్ని రోజులుగా నిరంతరం డ్రైవ్ చేస్తున్నాం. రోడ్డును ఆక్రమించి ఉండేవాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- వరలక్ష్మి, టీపీఏ, 31వ వార్డు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి : కలెక్టర్

సీతమ్మధార, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని, రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ఈఎన్‌టీ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కంటి ఆసుపత్రిలో వార్డులో పర్యటించిన కలెక్టర్ రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఈఎన్‌టీ ఆసుపత్రిని సందర్శించి సేవలను పరిశీలించారు. వివిధ విభాగాల వైద్యాధికారులతో మాట్లాడారు. ఆయన వెంట డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, వైద్యులు, బ్యాంక్ అధికారులు

నేత్ర వైద్యశాలకు యూనియన్ బ్యాంక్ మొక్కల వితరణ

సీతంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బుల్లయ్య కళాశాల ఆవరణలోని యూనియన్ బ్యాంక్ నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు బ్యాంక్ అధికారులు ఉచితంగా మొక్కలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆవరణలో వైద్యులు, బ్యాంక్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఆర్ఎంవో డాక్టర్ నవీన్ కుమార్, ఇతర వైద్యులు, ఎస్.వెంకటరావు, బ్యాంక్ అధికారులు డి.అనిల్‌కుమార్, ఎస్ సంతోష్‌కుమార్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌కు రూ.50 లక్షలు: గొల్ల బాబూరావు

సీతంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో సమాన అవకాశాలు ఉండాలని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం-ప్రభుత్వ రంగ పరిశ్రమలు-రిజర్వేషన్లు' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబూరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీ లాడ్స్ నుంచి అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌కు రూ.50 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం నిర్వాహకులు గొల్లబాబూరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్, అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి. ప్రభాకర్, పలు సంఘాల ప్రతినిధులు బయ్యే మల్లయ్య, ఐ.అనిల్‌కుమార్, వీఎన్ఎస్ కుమార్, కె.రాంబాబు, వై.రాంబాబు, ఎస్.రాజులు, సొసైటీ కోశాధికారి గార సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బత్తుల గౌతమ్ బాబు, ఉపాధ్యక్షులు కె.సాధు, బీఎస్ నాయుడు, అలమండ ప్రసాద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

» జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ ఆకాంక్షించారు. శనివారం జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎంయూపీ పాఠశాలను సందర్శించారు. ఆమె విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల నాణ్యత, రుచి ఎలా ఉన్నదీ అభిప్రాయాలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజన పథక రికార్డులను పరిశీలించారు. అనంతరం భోజనం రుచి చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలు, నాణ్యమైన విద్య, ఇతరత్రా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని హితవు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా సివిల్ జడ్జి శేషమ్మ పాఠశాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆసుపత్రిని అప్పగించడం తగదు'

అక్కయ్యపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు శనివారానికి 19వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ఉందని మండిపడ్డారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిని కేవలం లాభాల కోసం ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమన్నారు. నాయకులు శంకరరావు, రాములు, నాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతోనే విద్యార్థులకు గుర్తింపు

డాబాగార్డెన్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మక విధానాలతో స్ఫూర్తిగా నిలుస్తారని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షులు ధర్మేందర్, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ ఆశా జ్యాస్తి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ చెఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 'స్వచ్ఛమైన , సంప్రదాయక ఆహారం' అనే అంశంపై పోటీని నిర్వహించారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించగలరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ కపుల్స్ కార్యదర్శి శ్రావణి, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కరుణ, సభ్యులు జయ, జ్యోతి, డాలి, రాధిక, రజని, సహిదా, శ్రీనివాసరావు, శద్, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షులు ధర్మేందర్

'పేదలకు అండగా కూటమి ప్రభుత్వం'



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జనసేనలో చేరిన వారందరికీ పార్టీ, కూటమి ప్రభుత్వం సముచితమైన స్థానం కల్పిస్తుందని, పేదలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట రాజజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో డాబాగార్డెన్స్ వుమెన్స్ కాలేజీ ఎదురుగా గల ఫుడ్ కోర్టు అధ్యక్షుడు పోలవరపు నరసింగ్ ఆధ్వర్యంలో ఫుడ్ కోర్టు సభ్యులంతా జనసేన పార్టీలో చేరారు. సుమారు వంద కుటుంబాలవారికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన పార్టీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మరో 20 మంది ముఖ్యులు త్వరలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ రాక్షస పాలన పోయి కూటమి ప్రభుత్వంతో మంచి అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌బాబు, ఫుడ్ కోర్టు సభ్యులు కె.సాయికుమార్, అరసాడ లక్ష్మీ, ఎ.భారతి, చిన్న, వంశీ, రమేష్, రమణమ్మ, సత్యవతి, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈడీ అలజడి

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఎక్కడెక్కడ సోదాలు నిర్వహించాలనే దానిపై పక్కాసమాచారం సేకరించిన తర్వాతే అధికారులు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏకకాలంలో ఐదుచోట్ల సోదాలు ప్రారంభించినట్టు చెబుతున్నారు. ఈడీ అధికారులు సోదాలకు వెళ్లిన సమయంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంట్లోనే ఉన్నట్టు సమాచారం. ఎంవీవీ సమక్షంలోనే ఈడీ అధికారులు సోదాలు నిర్వహించినట్టు చెబుతున్నారు. సోదాల్లో అధికారులకు ఏఏ పత్రాలు లభ్యమయ్యాయి, మనీలాండరింగ్ జరిగినట్టు నిర్ధారించేందుకు కావాల్సిన ఆధారాలేమైనా దొరికాయా?...అనే వివరాలు మాత్రం తెలియరాలేదు.

'ఇక్కడ మద్యం దుకాణం వద్దు'

జ్ఞానాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 34వ వార్డు పరిధిలో చావుల మదుం బ్రిడ్జిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించి, వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు శనివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. ఈ ప్రాంతంలో వైన్ షాపు పెడితే దీనికి అనుకుని నివసిస్తున్న 400 కుటుంబాలవారు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. అసలే కాలనీలోకి వెళ్లేందుకు కేవలం పది అడుగుల రోడ్డు కూడా లేదని, షాపు ఏర్పాటు చేస్తే అటుగా వెళ్లే మహిళలు, విద్యార్థినులకు భద్రత ఉండదన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నవజాత శిశువు మృతి

» గైనిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడమే కారణం

» అగనంపూడి ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, బంధువులు



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అగనంపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నవజాత శిశువు కళ్లు తెరవక ముందే తనువు చాలించిన సంఘటన అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై ఓ కమిటీ వేసి విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం నడుపూరుకు చెందిన నాగులపల్లి సుచిత్రకు నెలలు నిండి శుక్రవారం ఉదయం నొప్పులు ప్రారంభం కావడంతో ప్రసవం నిమిత్తం అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సుఖ ప్రసవం అవుతుందని, తక్షణమే ఆస్పత్రిలో చేరాలని సూచించడంతో కుటుంబ సభ్యులు జాయిన్ చేశారు. కాగా రాత్రి ఏడు గంటల సమయంలో సుచిత్రకు నొప్పులు వస్తున్నాయని కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ప్రసవం జరిగేందుకు ఇంకా సమయం పడుతుందని, అప్పటివరకు ఓపిక పట్టాలని వారు సూచించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఆమెకు నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు సెక్యూరిటీ సిబ్బంది సాయంతో డ్యూటీ డాక్టర్, నర్సింగ్ సిబ్బందిని సంప్రతించారు. తమ నిద్రకు భంగం కలగడంతో సదరు సిబ్బంది కసురుకుంటూ వెళ్లేసరికే శిశువు తల భాగం బయటకు వచ్చింది. ఆ సమయంలో గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది తెలిసీ తెలియని వైద్యం చేశారు. ఈ క్రమంలో శిశువు తల భాగాన్ని బలంగా పట్టుకుని లాగడంతో శరీరం ఎర్ర బారింది. శిశువును బయటకు తీసేసరికి ఏడవకపోవడంతో ఆందోళనకు గురైన వైద్య సిబ్బంది ఫోన్‌లో గైనిక్ డాక్టరును సంప్రతించారు. శిశువు ఉమ్మనీరు తాగాడని, తక్షణమే కేజీహెచ్‌కు తరలించాలని ఆ డాక్టర్ స్పష్టం చేయడంతో అంబులెన్స్ తీసుకురావాలని కుటుంబ సభ్యులకు సిబ్బంది సూచించారు. వారు అంబులెన్స్ తీసుకుని వచ్చేసరికి శిశువు మృతి చెందినట్టు సిబ్బంది చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై బంధువులకు సమాచారం అందించారు.

శిశువు మృతిపై బంధువుల ఆందోళన

వైద్య సిబ్బంది నిరక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందాడంటూ తండ్రి రాజు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం నుంచి నొప్పులు వస్తున్నాయని చెబుతున్నా పట్టించుకోకపోవడం వల్లే బిడ్డ తమకు దక్కకుండా పోయాడని కన్నీరుమున్నీరయ్యారు. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ రాత్రి వేళల్లో గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడం దారుణమని మండిపడ్డారు. మాతాశిశు మరణాల నివారణకు ప్రభుత్వంచర్యలు చేపడుతున్నా కింది స్థాయిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలాంటిదుర్ఘటనలుజరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ భారతి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రెండో రోజూ ప్రజాదర్బార్

... 5వ పేజీ తరువాయి

ఉంటూ చదువుకుంటున్న వారి కుమారుడు చైతన్యనాయుడు ఒకరోజు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. దీంతో పోలీసులు రంగంలోకి చైతన్యనాయుడు ఫొటోతో పోస్టర్లు అతికించి గాలింపు చేపట్టారు. చివరకు హైదరాబాదులో ఉన్నట్టు గుర్తించి అక్కడకు వెళ్లి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఇంకా తమకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పింఛన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని నగరానికి చెందిన పుక్కళ్ల అప్పలరాజు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించిన లోకేశ్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆయన నగరంలో విద్యా సంస్థల తనిఖీకి బయలుదేరారు. మార్గమధ్యంలో అక్కయ్యపాలెం నెహ్రూ బజార్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం వద్ద ఆగారు. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన గ్రంథాలయం 9-45 గంటలకు కూడా మూసి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని నియమించనున్నట్టు చెప్పారు.

అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

నెహ్రూ బజార్ సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను మంత్రి లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలోని బాలలతో కొద్దిసేపు సరదాగా గడిపారు. ఏబీసీడీలు, రైమ్స్ వచ్చా?...అని అడగ్గా వారు ఆడుతూ, పాడుతూ సమాధానాలిచ్చారు. గుడ్లు, పౌష్టికాహారం సరఫరాపై టీచర్లను ఆరా తీశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచి వారితో కలిసి ఫొటో దిగారు.

హోటళ్లన్నీ ఫుల్

... 5వ పేజీ తరువాయి

సాగే ఈ సదస్సును నోవాటెల్‌లో నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ, విదేశాల నుంచి సుమారు 2,500 మంది వైద్యులు వచ్చారు. వారి కోసం మూడు నెలల ముందే వివిధ హోటళ్లలో రూమ్‌లు బుక్ చేశారు. విశాఖపట్నంలో టు స్టార్ నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ల వరకు అన్నింటినీ లెక్కలోకి తీసుకుంటే సుమారు మూడు వేల రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. అందులో 2,500 రూమ్‌లు వైద్యులకే కేటాయించడంతో గత ఐదు రోజులుగా కుటుంబాలతో వచ్చే వారికి స్టార్ హోటళ్లలో రూమ్‌లు దొరకడం లేదు. దీంతో చిన్న చిన్న లాడ్జీలను ఆశ్రయిస్తున్నారు. ఎప్పుడూ స్టార్ హోటళ్లలో సమావేశాలు నిర్వహించే భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కూడా సరైన వసతి దొరక్కపోవడంతో శనివారం పందిమెట్టలోని రాక్‌డేల్ హోటల్‌లో సమావేశం నిర్వహించుకుంది. నగరంలో హోటళ్లకు పెరిగిన డిమాండ్‌కు ఇదే నిదర్శనమని సీఐఐ ప్రతినిధులు చెబుతున్నారు.

ఈ సీజన్ బాగుంటుంది

విశాఖపట్నానికి ఈ పర్యాటక సీజన్ బాగుంటుందనే సూచనలు కనిపిస్తున్నాయి. దసరా నుంచి సీజన్ మొదలైంది. ఆరంభం బాగానే ఉంది. వైద్యుల సదస్సుతో మంచి ఆక్యుపెన్సీ వచ్చింది. అదే కొనసాగుతోంది. జనవరి నెలాఖరు వరకు ఇలాగే ఉండాలని ఆశిస్తున్నాం. ఈసారి పర్యాటక శాఖ విశాఖ ఉత్సవ్ నిర్వహించే అవకాశం ఉన్నందున పర్యాటకులు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

-పవన్ కార్తీక్, ఉపాధ్యక్షులు,
ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్

ఆత్మరక్షణకు కర్రసాము

... 5వ పేజీ తరువాయి

కూడా కర్రసాము నేర్చుకోడానికి పోటీపడుతున్నారు. నగరంలో ప్రస్తుతం నాలుగైదుచోట్ల కర్రసాము శిక్షణ కేంద్రాలు ఉండగా వాటిలో బాలికలు, యువతుల సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళితే తిరిగి వచ్చేంత వరకూ తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. విద్యార్థినుల నుంచి ఉద్యోగినుల వరకూ అందరిలోనూ ఎక్కడ ఆకతాయిలు ఏం చేస్తారోనని భయం వెన్నాడుతుంటుంది. అలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఆత్మరక్షణకు కర్రసాము బాగా ఉపయోగపడుతుందనే భావన చాలామంది తల్లిదండ్రులు, యువతుల్లో ఏర్పడుతోంది. దీంతో వ్యాయామంగా కూడా కర్రసామును గుర్తిస్తున్నారు. అందుకే కర్రసాము నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో కర్రసాములో నైపుణ్యం కలిగిన వారిలో కొందరు మరుగునపడిపోయిన ప్రాచీన యుద్ధకళను తిరిగి బతికించడానికి, భావితరాలకు ఆత్మరక్షణపై తర్ఫీదునిచ్చివారిలో ఆత్మవిశ్వాసం పెంచాలనే కోరికతో మరికొందరు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్క్‌లో లక్ష్మణ్‌దేవ్ గత పదేళ్లుగా కర్రసాము నేర్పుతుండగా, ఇటీవల కాలంలో ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రాము, బీచ్‌రోడ్డులో శ్రీను, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కిరణ్ కర్రసాము శిక్షణ ఇస్తున్నారు. కొందరు రాష్ట్ర స్థాయి పతకాలను సాధించడం విశేషం.

కర్రసాముతో శరీర దృఢత్వం పెరిగింది!

దాడులను అడ్డుకోవడానికి జరిగిన చర్చలో కర్రసాము ప్రస్తావన వచ్చింది. దీంతో ఎక్కడ శిక్షణ ఎక్కడ ఇస్తున్నారో స్నేహితుల ద్వారా తెలుసుకుని ఐదు నెలల కిందట ఇక్కడ చేరాను. కర్రసాము వల్ల ఎముకలు, కీళ్ల పటుత్వం పెరుగుతుంది. రక్తప్రసరణ సవ్యంగా జరగడంతో ఉత్సాహంగా ఉంటున్నా. ఆత్మరక్షణలో భాగంగా ఎవరినైనా ఎదిరించగలననే నమ్మకం ఏర్పడింది.

-ఎస్.మానస, ఇంజనీరింగ్ విద్యార్థిని


కర్రసాముకు ఆదరణ పెరుగుతోంది

ప్రాచీన భారతీయ యుద్ధకళను బతికించాలనే ఉద్దేశంతో పదేళ్ల కిందట కర్రసాములో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. మొదట్లో ఇద్దరు ముగ్గురే వచ్చేవారు. రానురాను సంఖ్య పెరిగింది. గత మూడేళ్లలో నేర్చుకునేందుకు వచ్చేవారిలో బాలికలు, యువతులు ఎక్కువగా ఉంటున్నారు. కొందరు ఒకవైపు సంప్రదాయ కూచిపూడి, భరతనాట్యం నేర్చుకుంటూనే..మరోవైపు కర్రలు తిప్పి ఎదుటివారి మక్కలు విరగ్గొట్టే కర్ర సాములో నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

- బీవీ లక్ష్మణదేవ్

కాంట్రాక్టు కార్మికుల మెడపై మెడికల్ కత్తి!

- 50 ఏళ్లు దాటిన వారంతా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్న ఉక్కు యాజమాన్యం
- ఎందుకోసమో తెలియక బిక్కుబిక్కుమంటూ పనులు సాగిస్తున్న 3,150 మంది కార్మికులు
- యాజమాన్యం కుట్రలో భాగమేనంటున్న కార్మిక సంఘాల నాయకులు
- ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలంటూ 22న ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద భారీ ధర్నా



ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలోని కాంట్రాక్టు కార్మికుల మెడపై ఇప్పుడు మరో కత్తి వేలాడుతుంది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని నిస్సహాయ స్థితిలో కార్మికులు బిక్కుబిక్కుమంటూ పనులు సాగిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న 50 ఏళ్లు పైబడిన కాంట్రాక్టు కార్మికులు 3,150 మంది ఉన్నారు. అయితే వీరందరూ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చెప్పారంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలని ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులలో సూచించింది. వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన జాబితాను సైతం విడుదల చేసింది. ప్లాంటులో గల ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వద్ద రక్త పరీక్షలను, ఇతర టెస్టులను ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చేయించుకోవాలని సంబంధిత విభాగాల అధికారులు ఆయా కాంట్రాక్టు కార్మికులకు సూచించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఎందుకు వైద్య పరీక్షలు చేయించుకోమంటున్నారో అంతు చిక్కడం లేదని పలువురు కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంటులో సుమారు 4,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే క్రమంలోనే ఇదంతా జరుగుతుందని, సుమారు 550 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు మళ్లీ టెండర్లను పునరుద్ధరించడం లేదా కొత్తగా టెండర్లను పిలవకపోవడం, తాజాగా యాభై ఏళ్లు నిండిన 3,150 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించడాన్ని బట్టి చూస్తే ఇదంతా కార్మికులను తొలగించే కుట్రలో భాగమేనని పలువురు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈఎస్‌ఐ లేని వారికి ఆ సౌకర్యాన్ని కల్పించాలని, లేకుంటే గతంలో ఈఎస్‌ఐకి కేటాయించిన నిధులతో హెల్త్ కార్డులు ఇచ్చి కాంట్రాక్టు కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాలు కోరినా పట్టించుకోని ఉక్కు యాజమాన్యం ఇప్పుడు మెడికల్ టెస్టులు అంటూ ముందుకు సాగుతుండడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. ప్లాంటులో కొన్ని విభాగాల్లో ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సౌకర్యాలు కల్పించకుండా ఇప్పుడు వైద్య పరీక్షలు చేపడుతుండడాన్ని చూస్తుంటే ఇదంతా ఉద్యోగాల నుంచే తీసివేసే కుట్రలో భాగంగా కనిపిస్తుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ టెస్టులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోకపోతే ఈ నెల 22న ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు కుట్ర

-జి.శ్రీనివాసరావు, సీఐటీయూ కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షుడు



స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను ఎలాగైనా తొలగించాలనే కుట్రతో యాజమాన్యం ముందుకు సాగుతుంది. ఇది మంచి పద్ధతి కాదు. 4,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తామని చెప్పినప్పుడు పెద్ద ఎత్తున ఉద్యమం చేయడంతో ఆ చర్యలను ఉక్కు యాజమాన్యం విడనాడింది. కానీ ఏదో ఒక విధంగా కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూస్తుంది. ఉక్కు యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 22న చేపట్టనున్న భారీ ధర్నాను అందరూ విజయవంతం చేయాలి.

పెందుర్తి-అరకు రోడ్డుకు మహర్దశ

- రహదారి విస్తరణకు రూ.956.21 కోట్లు కేటాయిస్తామన్న కేంద్ర ప్రభుత్వం

పెందుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మంజూరైన ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించేందుకు గురువారం కేంద్ర రహదారులు, రవాణాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోని పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదగా అరకు ఎన్‌హెచ్ 516 విస్తరణ పనులకు మోక్షం లభించనున్నది. భారతమాల పరియోజన పథకం కింద సుమారు 45 కిలోమీటర్ల వరకు రోడ్డును విస్తరించనున్నారు. ఈ రహదారికి 516-బీ నంబర్‌ను కేటాయించి నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. పెందుర్తి నుంచి కొత్తవలస, ఎస్.కోట మీదగా బొడరా రోడ్డు వద్ద 516-బీ హైవేను కలిపేలా రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం భూ సేకరణ, పునరావాసం, నిర్మాణానికి కలిపి రూ.956.21 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలుపుతూ కేంద్ర రహదారులు, రవాణా శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. ఈ క్రమంలో ఈ రహదారిలో చేపట్టనున్న రూ.782 కోట్ల పనులకు సంబంధించి గత నెలలో టెండర్లను ఆహ్వానించి కాంట్రాక్టరును కూడా ఖరారు చేశారు

పనులకు కదిలిక

పెందుర్తి నుంచి అరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి నిధులు కేటాయింపు జరగడంతో పనుల్లో కదలిక రానున్నది. సర్వే చేపట్టి అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు తెలిసింది. అనంతరం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి వివాదాలు లేని చోట రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ రహదారి విస్తరణ పూర్తయితే ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని చెప్పవచ్చు.



పెందుర్తి-అరకు (బొడరా) రోడ్డు

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 50 శాతం వసూలు
- మొండి బకాయిలను రాబట్టేందుకు కృషి చేస్తున్న జీవీఎంసీ జోనల్ అధికారులు



గాజువాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) గాజువాక జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను శత శాతం వసూళ్లపై గ్రేటర్ రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. గాజువాక జోనల్ పరిధిలో సుమారు లక్షా ఏడు వేల వరకు అసెస్‌మెంట్లు ఉండగా ఆర్థిక సంవత్సరానికి గాను సుమారు రూ.68 కోట్ల మేర వసూలు కావాల్సి ఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు 50 శాతం వసూలు చేయడం జరిగిందని, శత శాతం వసూళ్లపై దృష్టి సారించామని అధికారులు పేర్కొన్నారు. కాగా మొండి బకాయిదారులపై ప్రధానంగా దృష్టిసారించారు.

మొండి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి ఆస్తి పన్ను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. జోనల్ పరిధిలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా, సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని పేర్కొంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లిస్తే ఇబ్బందులు ఉండవని, ముందుగా చెల్లిస్తే రాయితీ వస్తుందన్నారు. అంతేకాకుండా ఎవరైనా ఆలస్యంగా చెల్లిస్తే అదనంగా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వివరిస్తున్నారు. అందువల్ల అందరూ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించే విధంగా జోనల్ రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బందికి సూచిస్తున్నారు. దీంతో వారు ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను చెల్లించాలని చెబుతున్నారు. ఆస్తి పన్ను చెల్లించేందుకు గాను గాజువాక జోనల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌తో పాటు పలు వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో గల వివిధ పరిశ్రమలు, సంస్థలు, యూనిట్ల నుంచి కూడా ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది శత శాతం వసూలు చేయాలనే సంకల్పంతో ఉన్నామని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు, జోనల్ కమిషనర్ విజ్ఞప్తి చేస్తున్నారు.



స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

ములగాడలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

మల్కాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు పరిధి ములగాడలో ఎట్టకేలకు జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం సిబ్బంది స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. డాక్‌యార్డు బ్రిడ్జి మూసివేత తర్వాత ములగాడలో ఇటీవల ట్రాఫిక్ రద్దీ బాగా పెరిగిపోవడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో అత్యంత వేగంగా వాహనాలు నడుపుతున్న వారికి కళ్లెం వేసేలా స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికు జీవీఎంసీ అధికారులను కోరడంతో వారు స్పందించారు. ములగాడలో పలుచోట్ల స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నిరసన

వేపగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులపై పెను భారాన్ని మోపేందుకు చేపడుతున్న చర్యలపై సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆర్.ఆర్.విపురం సబ్ స్టేషన్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ గోపాలపట్నం శాఖ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమన్న సీఎం చంద్రబాబు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.17,137 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచిచే కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు ఎం.వరప్రసాదరావు, అనుసూయ, గోవిందరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచవటి పార్కు ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీ జంక్షన్ సమీపంలోని లక్ష్మీనగర్‌లో నూతనంగా నిర్మించిన పంచవటి పార్కును ఆదివారం ఉదయం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించనున్నారు. ఈ పార్కును సుమారు రూ.27 లక్షలతో నిర్మించారు. ఈ పార్కు ప్రారంభంతో లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్, కొండవాలు ప్రాంతంలోని పాదచారులు, కాలనీవాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

చిరు వ్యాపారిపై పోలీస్ ప్రతాపం

పెందుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారిపై ఓ పోలీసు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. తమ బంధువుతో కలిసి టిఫిన్ సెంటర్ నిర్వాహకుడిని చితకబాదాడు, పెందుర్తి సమీపంలోని కృష్ణరాయపురంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కృష్ణరాయపురం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఇడ్లీ సాంబార్ పేరుతో ఎల్లంకి మహేశ్వరరావు అనే వ్యక్తి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఈ టిఫిన్ సెంటర్ వెనక గల ఓ అపార్ట్‌మెంట్లో నివసిస్తున్న గణేశ్ అనే వ్యక్తి కారులో వస్తుండగా టిఫిన్ సెంటర్ సమీపంలో ఓ వ్యక్తి బైక్‌పై ఫోన్లో మాట్లాడుతుండడాన్ని గమనించి హారన్ మోగించాడు. కారు దిగిన గణేశ్ టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చి నిర్వాహకుడుతో గొడవకు దిగాడు. ఇక్కడ టిఫిన్ సెంటర్ ఉన్నందునే వాహనాల రద్దీతో రోడ్డు బ్లాక్ అవుతుందని, అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే రోడ్డు మీద బైకుపై ఉన్న వ్యక్తి తన టిఫిన్ సెంటర్ రాలేదని మహేశ్ చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గణేశ్‌కు నచ్చజెప్పేందుకు మహేశ్ తమ్ముడు రామూర్తి యత్నించినా వినకుండా షాపులోని ఫ్లెక్సీలను విసిరేసినట్టు బాధితుడు తెలిపాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం గణేశ్ తమ బంధువైన ఆనంద్‌ప్రసాద్‌తో కలిసి టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చారు. పెందుర్తి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాని చెబుతూ ఆనంద్‌ప్రసాద్, గణేశ్‌లు మహేశ్‌పై పిడిగుద్దులతో దాడి చేసినట్టు బాధితులు తెలిపారు. తాను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగినని మహేశ్ సోదరుడు రామ్మూర్తి తన ఐడీ చూపించి అడ్డుకోబోయినా పట్టించుకోలేదని తెలిపారు. గాయపడిన మహేశ్‌ను సుజాతనగర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్య చికిత్స కోసం చేర్పించగా, ఎమ్మెల్సీ ఆధారంగా పెందుర్తి పోలీసులు విచారణ జరిపి కేసు నమోదు చేశారు, కాగా మహేశ్‌పై దాడికి పాల్పడిన ఆనంద్‌ప్రసాద్ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో పనిచేయడం లేదని తెలిసింది. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్టు బాధితుడు సోదరుడు రామ్మూర్తి తెలిపారు, దీనిపై ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో విచారణ సాగిస్తున్నామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు.

క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన

అగనంపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎంబీఏ విద్యార్థులకు క్యాపిటల్ మార్కెట్, దాని పరిణామం అనే అంశంపై శనివారం అగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కార్యక్రమాన్ని బ్రాడ్ రిడ్జ్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అసోసియేట్ ప్రాసెస్ మేనేజర్ టి.సాయి సందీప్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాపిటల్ మార్కెట్ పరిణామం, దాని ప్రాముఖ్యం, పెట్టుబడిదారులకు ఉన్న అవకాశాలకు గురించి వివరించారు. మార్కెట్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, కొత్త అవకాశాలు, భవిష్యత్తు ధోరణలపై చర్చించారు. విద్యార్థులంతా ఇప్పటి నుంచి మార్కెట్ రంగంపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం సాయి సందీప్‌ను 'విజ్ఞాన్' ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, హెచ్‌వోడీ బి.చంద్ర, డీన్లు, తదితరులు పాల్గొన్నారు.



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

చింతలలోవలో నాగుపాము హల్‌చల్

సింధియా, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో ఏడడుగుల నాగుపాము హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చింతలలోవలో గల ఓ చికెన్ షాపును శుక్రవారం రాత్రి పదిన్నరప్పుడు యజమాని మూసివేస్తుండగా కోళ్లను భద్రపరిచే ప్రదేశం నుంచి బుసలు కొడుతున్న శబ్ధం వచ్చింది. దీంతో ఆయన అక్కడకు వెళ్లి చూడగా నాగుపాము కనిపించడంతో భయంతో బయటకు పరుగులు తీశాడు. వెంటనే ఆయన స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న నాగరాజు ఎంతో చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు. అనంతరం దానిని యారాడ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 50 దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

మల్కాపురంలో జోనల్ కమిషనర్ పర్యటన



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్సీ రాము

మల్కాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము 61వ వార్డు పరిధి మల్కాపురం ప్రాంతంలో శనివారం ఆకస్మికంగా పర్యటించారు. మల్కాపురం పరిసరాలను ఆయన పరిశీలించి పారిశుధ్యం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్తలు ఉన్నచోట శుభ్రం చేస్తే బాగుంటుందని సూచించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏ రోజు చెత్త ఆ రోజే తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వార్డులో ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జెడ్సీ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు ఉన్నారు.

రైతు బజారును సందర్శించిన ఏడీఎం



ఉల్లిపాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఎం యాసిన్

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతుబజారులో సబ్సిడీపై విక్రయాలు సాగిస్తున్న ఉల్లిపాయలు కౌంటర్లను, నూనె స్టాళ్లను జిల్లా మార్కెటింగ్ శాఖ ఉపసంచాలకులు (ఏడీఎం) యాసిన్ శనివారం పరిశీలించారు. బహిరంగ మార్కెట్‌లో వంట నూనెల ధరలు అధికంగా ఉండడంతో రైతు బజార్లలో సబ్సిడీపై పామాయిల్ కిలో రూ.110, క్రిస్టల్ సన్‌ఫ్లవర్, ఫ్రీడమ్, గోల్డ్ డ్రాప్ సన్ ఫ్లవర్ ఆయిల్లను లీటరు రూ.124కు విక్రయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలను అదుపులోకి తెచ్చేందుకు మార్కెటింగ్ శాఖ ఉల్లిపాయలను కర్నూలు నుంచి కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

గోపాలపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలంతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవా లన్నారు. ముఖ్యంగా గర్భిణులకు రక్తహీనత కారణంగా ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని, వీటిని అధిగమించడానికి మునగాకు కూర తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారాన్ని తీసుకుంటే తల్లి, బిడ్డల ఆరోగ్యం బాగుంటందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగనంపూడి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి సూచించారు. పినమడక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 'మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి తొలి మెట్టు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సాయి సరస్వతి, తులసి, వరలక్ష్మి, కమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై సినర్జీస్‌లో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌లో భాగంగా మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ ముని రత్నంనాయుడు అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో శనివారం సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో ప్రమాదాల నివారణపై నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల్లో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు, రసాయనాలు, విద్యుత్ షార్టు సర్క్యూట్ ఏర్పడినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫౌండ్రి సీనియర్ మేనేజర్ రమణమూర్తి, కంపెనీ భద్రతాధికారి నీలకంఠరావు, శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా చూడాలని వినతి



లోకేశ్‌తో లక్ష్మీబాబు, వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. నగరానికి విచ్చేసిన లోకేశ్‌ను వారు కలిసి ప్లాంటులో నెలకొన్న సమస్యలను వివరించారు. అందుకు స్పందించిన లోకేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగే అవకాశమే లేదని చెప్పినట్టు వారు పేర్కొన్నారు.

ఇంటక్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఉక్కు నాయకులు



ఇంటక్ నేత సంజీవరెడ్డితో ఉక్కు కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ప్లాంటులో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, కార్మికుల ఇబ్బందులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. ఈ నేపథ్యంలో ఉక్కు కర్మాగారంలో పర్యటించాలని, ప్లాంటులో నెలకొన్న ప్రధాన సమస్యలపై కేంద్రంతో మాట్లాడాలని వేడుకున్నారు. సంజీవరెడ్డిని కలిసిన వారిలో ఇంటక్ నాయకులు గరికిన మోహనరావు, వీజే శేఖర్, ఉప్పలపాటి అశోక్‌రాజు, దేవిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హై స్కూల్ మైదానంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాల పునర్నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ సంద్రాన రమణమ్మ కుటుంబ సభ్యులు ఆరు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం ఆలయాల వద్ద జరిగిన గ్రామ కమిటీ సభ్యులకు రమణమ్మ కుమారులు సంద్రాన శ్రీనివాసరావు, నూకరాజు, బాబూరావులు చెక్కు అందించారు.

సెల్ ఫోన్, నగదు చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో లారీలో పడుకున్న డ్రైవర్ సెల్‌ఫోన్, నగదు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శనివారం దువ్వాడ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు నుంచి గాజువాకకు టమాటా లోడ్‌తో వచ్చిన లారీని డ్రైవర్ ఎస్.చిరంజీవి అన్ లోడింగ్ చేసి, తిరిగి లోడింగ్ కోసం కూర్మన్నపాలెం రేడియో స్టేషన్ రోడ్డులో ఈ నెల ఐదున పార్కింగ్ చేసి నిద్రపోయాడు. ఉదయం లేచి చూసేసరికి లారీ డ్యాష్ బోర్డులో పెట్టిన సెల్ ఫోన్, రూ.7 వేల నగదు కనిపించలేదు. దీంతో ఈ నెల 9న దువ్వాడ క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రైమ్ డీసీపీ లతా మాధురి పర్యవేక్షణలో ఏసీపీ వెంకటరావు, సీఐ కె.శ్రీనివాసరావులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పెదగంట్యాడ దరి దయాళ్‌నగర్‌కు చెందిన పాత నేరస్థుడు కండిపల్లి మణి లోకేశ్ (23) వడ్లపూడిలో అమ్మా సెల్ పాయింట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో క్రైమ్ ఎస్ఐ రమణారెడ్డి అదుపులోకి తీసుకుని విచారించడంతో దొంగతనం చేసినట్టు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి సెల్ ఫోన్, రూ.ఏడు వేలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

ఎండాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మధురవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాడే భానుప్రకాశ్ (16) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విద్యార్థి స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా బొబ్బిలి. దసరా సెలవుల తరువాత రెండు రోజుల క్రితం కళాశాలకు వచ్చాడు. సాయంత్రం వాంతులు కావడంతో కళాశాల వసతి గృహం సిబ్బంది అతన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువె ళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా విద్యార్థిని సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లకపోవడం వల్లే మృతి చెందాడని, మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్ కష్టాలు తీరేదెన్నడో?

- నిర్దేశిత సమయం లేకుండా పంపిణీతో ఇబ్బందులు
- తొలి వారానికే పంచదార పరిమితం
- ఆ తర్వాత కేవలం బియ్యం మాత్రమే
- పాత పద్ధతే మేలు అంటున్న కార్డుదారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ రేషన్ ఇబ్బందులకు గురి చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ డిపో సిబ్బంది సమయానికి రేషన్ ఇవ్వరు... వారికి అనువైన సమయంలోనే మాత్రమే ఇస్తారు. నిర్దేశిత సమయంలో అంటూ ఉండదు. రేషన్ వాహనం వస్తుందని సమాచారం అందించి చెప్పిన సమయానికి రాకుండా రోడ్లపై పడిగాపులు కాసేలా చేస్తున్నారంటూ రేషన్ కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు.



ఒకప్పుడు లబ్ధిదారులు వారికి నచ్చిన సమయంలో (ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు), 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రేషన్ డిపోలకు వెళ్లి సరుకులను తీసుకునే వెసులుబాటు ఉండేది. కానీ రేషన్ వాహనాలు వచ్చాక కార్డుదారుడు తనకు నచ్చిన తేదీల్లో, సమయాల్లో రేషన్ తీసుకునే అవకాశం లేకుండా పోయింది. అంతేకాకుండా రేషన్ కోసం రోడ్లపై పడిగాపులు కాయాల్సిన దుస్థితి. ఇది చాలదన్నట్టు బయోమెట్రిక్ మెషిన్ మొరాయింపు కూడా దీనికి తోడైంది. నెలలో మొదటి నుంచి బయోమెట్రిక్ మెషిన్లు మొరాయిస్తే లబ్ధిదారులు రోడ్లపై పడిగాపులు కాసి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కూడా నెలకొంటోంది.

రేషన్ సరఫరాలో ఇచ్చే బియ్యం, పంచదారలలో మొదటి 8 రోజులు ఎవరికైతే వ్యాన్ దగ్గర రేషన్ ఇస్తారో వారికి రేషన్‌లో సరఫరా చేసే అన్ని సరుకులు లభిస్తాయి. ఆ తరువాత 15వ తేదీ వరకు రేషన్‌ను ఇస్తున్న కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. వెంటనే ఈ పద్ధతిని మార్చి పాత పద్ధతిలో రేషన్ సరఫరా చేయాలని, రేషన్ వాహనాలను తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఆటోమోటివ్ వద్ద రేషన్ కోసం రోడ్డుపై బారులు తీరిన లబ్ధిదారులు(ఫైల్ ఫోటో)

సంక్షిప్తంగా..

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు

- 30 రోజులకు రూ.19,08,894



పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

సిరిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆశీల్‌మెట్టలోని ఆలసంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. గడిచిన 30 రోజుల్లో సమకూర్చిన ఆదాయాన్ని లెక్కించినట్టు ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. నగదు రూ.19,08,894, సిల్వర్ 0-132-100 మిల్లీగ్రాములు, యూఎస్‌ఏ డాలర్స్ 21, సింగపూర్ డాలర్స్ 10, యుఏఈ 10, సౌదీరియల్స్ 5, ఓమెన్ రీయల్స్ 1 లభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్స్ ఎం.శ్రీధర్, శివజ్యోతి సేవా సంఘం, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

వెంకోజీపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవో 117 రద్దుతో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయ సంఘాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక విద్య నిర్వీర్యానికే వైసీపీ ప్రభుత్వం జీవో 117 తెచ్చిందని, జగన్ తెచ్చిన ఆ చెత్త జీవోను రద్దు చేసి పాఠశాల విద్య ఊపిరి నిలిపిన లోకేశ్‌కు ధన్యవాదాలు అంటూ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి అపోటా రూ.లక్ష విరాళం



రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న జాలాది రవి

వెంకోజీపాలెం, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల్లో నష్టపోయిన వారికి ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తరపున సంఘం ముందుకు వచ్చింది. సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ జాలాది రవి రాష్ట్ర హెచ్‌ఆర్డీ మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.లక్ష విరాళాన్ని డీడీ రూపంలో అందజేశారు.

జిరాక్స్ మిషన్ వితరణ



కృష్ణా కళాశాలకు జిరాక్స్ మిషన్ అందజేస్తున్న లైన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శనివారం లైన్స్ క్లబ్ ప్రతినిధులు జిరాక్స్ మిషన్ వితరణగా అందించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులకు కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, సుధాకరరావు, ప్రసాదరాజు, కళాశాల సిబ్బంది సన్యాసినాయుడు, కృష్ణారావు, ఆర్వీ నాయుడు,వేదవ్యాస్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ సమీపంలోని ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో ఉన్న హెలెన్ కెల్లర్ అంధుల పాఠశాలను జిల్లా సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ శనివారం సందర్శించారు. అక్కడి తరగతి గదులు, భోజనశాల, వసతి గదులు, వంటగదిని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు తొలగింపుపై ప్రభుత్వానికి నివేదిక

మద్దిలపాలెం, అక్టోబరు 19 : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ రోడ్డులో తోపుడుబండ్ల తొలగింపుపై శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి నగర పోలీసులు నివేదిక అందించారు. కొన్ని నెలల కిందట జీవీఎంసీ, పోలీసులతో పిఠాపురం కాలనీ రోడ్డులోని తోపుడు బండ్లను వార్డు కార్పొరేటర్ పీతలమూర్తి ఆధ్వర్యంలో తొలగించే ప్రయత్నం చేశారు. దీనిపై కళాభారతి తోపుడు బండ్ల సంఘం కార్యదర్శి నసీరున్నీషా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదును పోలీస్ శాఖకు పంపించి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎంవీపీకాలనీ పోలీసులు బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

తమ వాదనను కోర్టులో వినిపించుకుంటామని, అంతవరకు తోపుడుబండ్లను తొలగించే ప్రయత్నం చేయవద్దని చిరు వర్తకులు అధికారులకు వివరించారు. తమకు రక్షణ కావాలంటూ కోరారు. ప్రస్తుతం తోపుడుబండ్ల తొలగింపు అంశం కోర్టులో ఉన్నందున కోర్టు ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటామని అధికారులు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



పాల్గొన్న విద్యార్థులతో కళాభారతి నిర్వాహకులు

మద్దిలపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కందుకూరి వీరేశలింగం పంతులుపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నగరంలోని ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వక్తృత్వ, జూనియర్ కళాశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డీవీ సూర్యారావు, జి.వేణు, పిల్ల రమణమూర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాభారతి గౌరవ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ గొప్ప సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు గురించి అవగాహన కల్పించడానికి పోటీలు నిర్వహించామన్నారు. ఈనెల 24న కళాభారతిలో నిర్వహించే సభలో విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం రేపు

వెంకోజీపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 3వ జోన్ పరిధిలో పలు ప్రాంతాలకు ఈ నెల 21న నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందనిజీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్సార్ నుంచి హై లెవెల్ రిజర్వాయర్‌కి వచ్చే ప్రధాన పంపింగ్ మెయిన్ లైన్ మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతుకు గురవడంతో ఈ అసౌకర్యం కలుగుతుందన్నారు. వార్డు నెంబరు 22పి లో టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థ నగర్, వార్డు నెంబరు 24పి లో పాత రేసపువాని పాలెం, వినాయక నగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, వార్డు నెంబరు 27లో అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్ పార్కు రోడ్డు, రెడ్డి ఆసుపత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకా నగర్ రోడ్డు నెంబరు 1 నుంచి 6 లైన్ల వరకు, అమర్‌నగర్ చర్చ్ రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ రోడ్డు తదితరర చోట్ల తాగునీటికి అంతరాయం కలుగుతుందన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నవజాత శిశువు మృతి

- గైనిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడమే కారణం
- ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, బంధువులు



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అగనంపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నవజాత శిశువు కళ్లు తెరవక ముందే తనువు చాలించిన సంఘటన అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై ఓ కమిటీ వేసి విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. వివరాలిలా ఉన్నాయి.

పెదగంట్యాడ మండలం నడుపూరుకు చెందిన నాగులపల్లి సుచిత్రకు నెలలు నిండి శుక్రవారం ఉదయం నొప్పులు ప్రారంభం కావడంతో ప్రసవం నిమిత్తం అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సుఖప్రసవం అవుతుందని, తక్షణమే ఆస్పత్రిలో చేరాలని సూచించడంతో కుటుంబ సభ్యులు జాయిన్ చేశారు. కాగా రాత్రి ఏడు గంటల సమయంలో సుచిత్రకు నొప్పులు వస్తున్నాయని కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ప్రసవం జరిగేందుకు ఇంకా సమయం పడుతుందని, అప్పటి వరకు ఓపిక పట్టాలని వారు సూచించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఆమెకు నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు సెక్యూరిటీ సిబ్బంది సాయంతో డ్యూటీ డాక్టర్, నర్సింగ్ సిబ్బందిని సంప్రతించారు. తమ నిద్రకు భంగం కలగడంతో సదరు సిబ్బంది కసురుకుంటూ వెళ్లేసరికే శిశువు తల భాగం బయటకు వచ్చింది. ఆ సమయంలో గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది తెలిసీ తెలియని వైద్యం చేశారు. ఈ క్రమంలో శిశువు తల భాగాన్ని బలంగా పట్టుకుని లాగడంతో శరీరం ఎర్ర బారింది. శిశువును బయటకు తీసేసరికి ఏడవకపోవడంతో ఆందోళనకు గురైన వైద్య సిబ్బంది ఫోన్‌లో గైనిక్ డాక్టరును సంప్రతించారు. శిశువు ఉమ్మనీరు తాగాడని, తక్షణమే కేజీహెచ్‌కు తరలించాలని ఆ డాక్టర్ స్పష్టం చేయడంతో అంబులెన్స్ తీసుకురావాలని కుటుంబ సభ్యులకు సిబ్బంది సూచించారు. వారు అంబులెన్స్ తీసుకుని వచ్చేసరికి శిశువు మృతి చెందినట్టు సిబ్బంది చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై బంధువులకు సమాచారం అందించారు.

శిశువు మృతిపై బంధువుల ఆందోళన

వైద్య సిబ్బంది నిరక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడంటూ తండ్రి రాజు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం నుంచి నొప్పులు వస్తున్నాయని చెబుతున్నా పట్టించుకోకపోవడం వల్లే తమ బిడ్డ తమకు దక్కకుండా పోయాడని కన్నీరుమున్నీరుగా విలపించారు. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ రాత్రి వేళల్లో గైనిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. మాతాశిశు మరణాల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ కింది స్థాయిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశువు మరణానికి కారణమైన వైద్య సిబ్బందిపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సూపరింటెండెంట్ భారతి వారితో మాట్లాడి తగిన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

ఉల్లి, టమాటా స్టాళ్ల పరిశీలన

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని రైతు బజారులో ఉల్లి, టమాటా స్టాళ్లను మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సుధాకర్, వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎస్‌కె యాసిన్, సహాయ ఇంజనీర్ కెనడీ శనివారం పరిశీలించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న టమాటా, ఉల్లి కౌంటర్ల పనితీరును పర్యవేక్షించారు. రూ.37లకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లి నాణ్యతపై వినియోగదారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా సబ్సిడీ నూనెల విక్రయాలను పరిశీలించారు. వివిధ కౌంటర్లలో రైతుల గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో స్థానిక జాతుల పరిరక్షణపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాప్ పోస్టర్‌ను శనివారం ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రెండో రోజూ ప్రజాదర్బార్

... 5వ పేజీ తరువాయి

ఉంటూ చదువుకుంటున్న వారి కుమారుడు చైతన్యనాయుడు ఒకరోజు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. దీంతో పోలీసులు రంగంలోకి చైతన్యనాయుడు ఫొటోతో పోస్టర్లు అతికించి గాలింపు చేపట్టారు. చివరకు హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి అక్కడకు వెళ్లి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఇంకా తమకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పింఛన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని నగరానికి చెందిన పుక్కళ్ల అప్పలరాజు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించిన లోకేశ్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రంథాలయం తీయకపోవడంపై అసంతృప్తి

కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆయన నగరంలో విద్యా సంస్థల తనిఖీకి బయలుదేరారు. మార్గమధ్యంలో అక్కయ్యపాలెం నెహ్రూ బజార్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం వద్ద ఆగారు. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన గ్రంథాలయం 9-45 గంటలకు కూడా మూసి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని నియమించనున్నట్టు చెప్పారు.

అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

నెహ్రూ బజార్ సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను మంత్రి లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలోని బాలలతో కొద్దిసేపు సరదాగాగడిపారు. ఏబీసీడీలు, రైమ్స్ వచ్చా?...అని అడగ్గా వారు ఆడుతూ, పాడుతూ సమాధానాలిచ్చారు. గుడ్లు, పౌష్టికాహారం సరఫరాపై టీచర్లను ఆరా తీశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచి వారితో కలిసి ఫొటో దిగారు.

ఆత్మరక్షణకు కర్రసాము

... 5వ పేజీ తరువాయి

కూడా కర్రసాము నేర్చుకోడానికి పోటీపడుతున్నారు. నగరంలో ప్రస్తుతం నాలుగైదుచోట్ల కర్రసాము శిక్షణ కేంద్రాలు ఉండగా వాటిలో బాలికలు, యువతుల సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళితే తిరిగి వచ్చేంత వరకూ తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. విద్యార్థినుల నుంచి ఉద్యోగినుల వరకూ అందరిలోనూ ఎక్కడ ఆకతాయిలు ఏం చేస్తారోనని భయం వెన్నాడుతుంటుంది. అలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఆత్మరక్షణకు కర్రసాము బాగా ఉపయోగపడుతుందనే భావన చాలామంది తల్లిదండ్రులు, యువతుల్లో ఏర్పడుతోంది. దీంతో వ్యాయామంగా కూడా కర్రసామును గుర్తిస్తున్నారు. అందుకే కర్రసాము నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో కర్రసాములో నైపుణ్యం కలిగిన వారిలో కొందరు మరుగునపడిపోయిన ప్రాచీన యుద్ధకళను తిరిగి బతికించడానికి, భావితరాలకు ఆత్మరక్షణపై తర్ఫీదునిచ్చివారిలో ఆత్మవిశ్వాసం పెంచాలనే కోరికతో మరికొందరు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్క్‌లో లక్ష్మణ్‌దేవ్ గత పదేళ్లుగా కర్రసాము నేర్పుతుండగా, ఇటీవల కాలంలో ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రాము, బీచ్‌రోడ్డులో శ్రీను, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కిరణ్ కర్రసాము శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారిలో కొందరు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లి పతకాలను సాధించడం విశేషం.

కర్రసాముతో శరీర దృఢత్వం పెరిగింది!

- ఎస్.మానస, ఇంజనీరింగ్ విద్యార్థిని

దాడులను అడ్డుకోవడానికి జరిగిన చర్చలో కర్రసాము ప్రస్తావన వచ్చింది. దీంతో ఎక్కడ శిక్షణ ఎక్కడ ఇస్తున్నారో స్నేహితుల ద్వారా తెలుసుకుని ఐదు నెలల కిందట ఇక్కడ చేరాను. కర్రసాము వల్ల ఎముకలు, కీళ్ల పటుత్వం పెరుగుతుంది. రక్తప్రసరణ సవ్యంగా జరగడంతో ఉత్సాహంగా ఉంటున్నాన. ఆత్మరక్షణలో భాగంగా ఎవరినైనా ఎదిరించగలననే నమ్మకం ఏర్పడింది.

కర్రసాముకు ఆదరణ పెరుగుతోంది

- బీఏ లక్ష్మణదేవ్

ప్రాచీన భారతీయ యుద్ధకళను బతికించాలనే ఉద్దేశంతో పదేళ్ల కిందట కర్రసాములో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. మొదట్లో ఇద్దరు ముగ్గురే వచ్చేవారు.

రానురాను సంఖ్య పెరిగింది. గత మూడేళ్లలో నేర్చుకునేందుకు వచ్చేవారిలో బాలికలు, యువతులు ఎక్కువగా ఉంటున్నారు. కొందరు ఒకవైపు సంప్రదాయ కూచిపూడి, భరతనాట్యం నేర్చుకుంటూనే..మరోవైపు కర్రలు తిప్పి ఎదుటివారి మక్కలు విరగ్గొట్టే కర్ర సాములో నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఈడీ అలజడి

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఎక్కడెక్కడ సోదాలు నిర్వహించాలనే దానిపై పక్కాసమాచారం సేకరించిన తర్వాతే అధికారులు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏకకాలంలో ఐదుచోట్ల సోదాలు ప్రారంభించినట్టు చెబుతున్నారు. ఈడీ అధికారులు సోదాలకు వెళ్లిన సమయంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంట్లోనే ఉన్నట్టుసమాచారం. ఎంవీవీ సమక్షంలోనే ఈడీ అధికారులు సోదాలు నిర్వహించినట్టు చెబుతున్నారు.సోదాల్లో అధికారులకు ఏఏ పత్రాలు లభ్యమయ్యాయి, మనీలాండరింగ్ జరిగినట్టు నిర్ధారించేందుకు కావాల్సిన ఆధారాలేమైనా దొరికాయా?... అనే వివరాలు మాత్రం తెలియరాలేదు.



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న రవీంద్ర, లక్ష్మీనారాయణ

సభ్యత్వ నమోదులో విశాఖ ప్రథమం

- బీజేపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు రవీంద్ర

పెదవాల్తేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కార్యాలయంలో బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో శనివారం క్రియాశీల సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో విశాఖ మొదటి స్థానంలో ఉందన్నారు. ఇప్పటి వరకూ 1.53 లక్షల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధ లక్ష్మీనారాయణ, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్.విజయానంద రెడ్డి, విశాఖ పార్లమెంట్ సంయోజక్ ఎస్‌ఏ రామ్మోహన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై సదస్సు



చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న ఆచార్య నరసింహారావు

వెంకోజీపాలెం, అక్టోబరు 19 : ఏయూలోని వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం (ఏఈఆర్‌సీ), భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి 'వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయం : సుస్థిర పద్ధతులు' అంశంపై సింపోజియంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, పండితులు పాల్గొని, వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయంపై దాని ప్రభావాన్ని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌పై దాని ప్రభావాన్ని చర్చించారు. ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఏఈఆర్సీ డైరెక్టర్ డాక్టర్ టీవీఎస్ రావు, ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జె.మోహన్‌రావు పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

మహారాజా బ్యాంకుకు బెస్ట్ కేవైసీ ఇనీషియేటివ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణంరాజు, సత్యనారాయణ

సిరిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఫ్రంటియర్స్ ఇన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డు లభించింది. శనివారం లక్నోలో నిర్వహించిన బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ ఎన్‌సీబీఎస్ అండ్ ఎఫ్‌సీబీఏ కాన్ఫరెన్స్-2024లో అవార్డును బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ ఎన్ఎన్ సత్యనారాయణ స్వీకరించారు. ఫ్రంటియర్స్ ఇన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డ్స్ 2024లో బెస్ట్ కేవైసీ ఇనీషియేటివ్ అవార్డు లభించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవార్డు వరుసగా మూడోసారి రావడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం 9 శాఖలతో బ్యాంకు సేవలు అందిస్తోందని, త్వరలో పదో శాఖను అనకాపల్లిలో ప్రారంభించనున్నట్టు చెప్పారు.

విశాఖ వేలీ స్కూలుకు జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్

ఆరిలోవ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేలీ స్కూలుకు జాతీయ స్థాయిలో నెంబరు వన్ అవార్డు రావడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ ఈశ్వరీప్రభాకర్ పేర్కొన్నారు. ఎడ్యుకేషనల్ వరల్డ్ ఇండియా స్కూలు గ్రాండ్ జ్యూరీ 2024- 25 జాతీయ అవార్డును విశాఖ వేలీ స్కూలు దక్కించుకుంది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్టు ఆమె తెలిపారు.

హోటళ్లన్నీ ఫుల్

... 5వ పేజీ తరువాయి

సాగే ఈ సదస్సును నోవాటెల్‌లో నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ, విదేశాల నుంచి సుమారు 2,500 మంది వైద్యులు వచ్చారు. వారి కోసం మూడు నెలల ముందే వివిధ హోటళ్లలో రూమ్‌లు బుక్ చేశారు. విశాఖపట్నంలో టు స్టార్ నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ల వరకు అన్నింటినీ లెక్కలోకి తీసుకుంటే సుమారు మూడు వేల రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. అందులో 2,500 రూమ్‌లు వైద్యులకే కేటాయించడంతో గత ఐదు రోజులుగా కుటుంబాలతో వచ్చే వారికి స్టార్ హోటళ్లలో రూమ్‌లు దొరకడం లేదు. దీంతో చిన్న చిన్న లాడ్జీలను ఆశ్రయిస్తున్నారు. ఎప్పుడూ స్టార్ హోటళ్లలో సమావేశాలు నిర్వహించే భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కూడా సరైన వసతి దొరక్కపోవడంతో శనివారం పందిమెట్టలోని రాక్‌డేల్ హోటల్‌లో సమావేశం నిర్వహించుకుంది. నగరంలో హోటళ్లకు పెరిగిన డిమాండ్‌కు ఇదే నిదర్శనమని సీఐఐ ప్రతినిధులు చెబుతున్నారు.

ఈ సీజన్ బాగుంటుంది

- పవన్ కార్తీక్, ఉపాధ్యక్షులు, ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్

విశాఖపట్నానికి ఈ పర్యాటక సీజన్ బాగుంటుందనే సూచనలు కనిపిస్తున్నాయి. దసరా నుంచి సీజన్ మొదలైంది. ఆరంభం బాగానే ఉంది. వైద్యుల సదస్సుతో మంచి ఆక్యుపెన్సీ వచ్చింది. అదే కొనసాగుతోంది. జనవరి నెలాఖరు వరకు ఇలాగే ఉండాలని ఆశిస్తున్నాం. ఈసారి పర్యాటక శాఖ విశాఖ ఉత్సవ్ నిర్వహించే అవకాశం ఉన్నందున పర్యాటకులు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

ఇంటర్వ్యూ

ప్రభుత్వ భూములతో ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు

పద్మనాభం తహసీల్దార్ ఆనందరావు



పద్మనాభం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి భవిష్యత్ అవసరాలకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ కె. ఆనందరావు చెప్పారు. శనివారం ఆయన తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

● తహసీల్దార్ : మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి వాటి వివరాలతో ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేస్తాం. తద్వారా ప్రభుత్వం నిర్దేశించిన అవసరాలకు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు కేటాయిస్తాం. అలాగే ప్రభుత్వ భూములకు రక్షణ కూడా ఉంటుంది.

● భూముల రీసర్వే ఎన్ని గ్రామాల్లో పూర్తి చేశారు ?

● తహసీల్దార్ : 17 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. పాండ్రంగి, రెడ్డిపల్లి, పొట్నూరు, గంధవరం, కొవ్వాడలో సర్వే చేయాల్సి ఉంది. ఇనాం గ్రామాలైన పద్మనాభం, కృష్ణాపురం, బీఆర్ తాళ్లవలసలో సర్వే జరగలేదు.

● సర్వే జరిగిన గ్రామాల్లో అనేక భూవివాదాలు ఉన్నాయి. వాటి పరిష్కారం ఎలా ?

● తహసీల్దార్ : రీసర్వేలో తలెత్తిన వివాదాల పరిష్కారానికి కలెక్టర్ నుంచి ఆదేశాలు రాగానే గ్రామసభలు ఏర్పాటు చేస్తాం. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి వివాదాలను పరిష్కరిస్తాం.

● ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు ?

● తహసీల్దార్ : కొత్తగా వచ్చాను. ఆ ఫైలును పరిశీలించి, వివరాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

● ప్రజలకు ధ్రువీకరణ పత్రాల జారీలో కొంత ఆలస్యం జరుగుతుంది. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారు ?

● తహసీల్దార్ : వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పంపించాల్సిందిగా వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజలు కూడా మీసేవ లేదా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పుడు ప్రింట్ తీసుకోవాలి. దీనివల్ల తమ సమస్యను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

'అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి'

సింహాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారులు వార్డుల్లో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఆదేశించారు. గుడ్ మార్నింగ్ కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన సింహపురి కాలనీలో పర్యటించారు. అక్కడ 13 లక్షల రూపాయలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 50 దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, క్యాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250



చిన్నాపురం జంక్షన్ నుంచి రాయ్‌పూర్ హైవే ఫ్లైఓవర్ మధ్యలో రోడ్డు దుస్థితి



గోతులతో అధ్వానంగా ఉన్న పెంట - గంథవరం రోడ్డు



దుమ్ము ధూళితో ఉన్న రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

ప్రయాణం.. సాహసం

» అధ్వాన రోడ్లతో వాహనదారులకు అవస్థలు

» వర్షం పడితే మరింత నరకయాతన

» ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు

పద్మనాభం/పద్మనాభం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే మరింత నరకయాతన అనుభవిస్తున్నారు. పద్మనాభం - శ్యాం ద్యాం, పద్మనాభం - చిన్నాపురం జంక్షన్ - విజయనగరం రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ రోడ్లపై ప్రయాణించడానికి నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతును పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలమయ్యాయి.పద్మనాభం గోస్తనీ నది వంతెన నుంచి జంక్షన్ వరకు, చిన్నాపురం జంక్షన్ నుంచి రాయపూర్ హైవే ఫ్లైఓవర్ వరకు, మద్ది నుంచి నీలకుండీల వరకు రోడ్లన్నీ పూర్తిగా పాడయ్యాయి. పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఈ మూడు కిలోమీటర్ల రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వర్షాల సమయంలో రోడ్డు మొత్తం చెరువులా మారుతోంది. దీంతో చాలామంది ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పద్మనాభం, రెడ్డిపల్లి సచివాలయాల సమీపంలో ఉన్న రోడ్లు వర్షం పడితే చెరువులను తలపిస్తున్నాయి. పద్మనాభం - మహారాజ్‌పేట రోడ్డులో రేవిడి, రెడ్డివాని కళ్లాల వద్ద వర్షం నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. శేరిఖండం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ స్కూల్ వరకు, మద్ది పెట్రోల్ బంకు నుంచి పద్మనాభం ప్రధాన జంక్షన్ వరకు, పెంట గ్రామం నుంచి కొవ్వాడ, గంధవరం, అలమండ ఆర్‌ఎస్‌కు వెళ్లే రోడ్ల దుస్థితి చెప్పనక్కర్లేదు. చాలా వరకు గోతులు ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పగటి పూట ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నా.. రాత్రి వేళ ప్రయాణమంటే పలువురు భయాందోళన చెందుతున్నారు.పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు

సింహాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ రోడ్డు నిర్మాణం ప్రారంభమై ఏడాది కావస్తున్నా పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం అసంపూర్తి ఉండడంతో సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద రాళ్లు తేలి పాదచారులకు గాయాలవుతున్నాయి. అలాగే ఇటీవల పడుతున్న వర్షాలకు కాంప్లెక్స్ ముందు గోతులు పడ్డాయి. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వర్షాలకు సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పడిన గొయ్యి

'పల్లె పండుగ'తో గ్రామాలు అభివృద్ధి : ఎమ్మెల్యే గంటా

పద్మనాభం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను ప్రగతి బాట పట్టించేందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు అన్నారు. శనివారం ఆయన రేవిడి, వెంకటాపురం, గెద్దపేట, బీఆర్ తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల అవసరాలను గ్రామ సభల ద్వారా గుర్తించడమే కాకుండా ఉపాధి నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేపడుతుందని చెప్పారు. యువత ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఎంతగానో శ్రమిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. విజయకుమార్, తహసీల్దార్ ఆనందరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి గంగరాజు, నగేష్‌కుమార్, సర్పంచ్ రమణ, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, నాయకులు అప్పలనాయుడు, నందీశ్వరరావు, ప్రసాద్, కొప్పల రమేశ్, సత్యనారాయణ, ఆర్‌ఎఎన్ మూర్తి పాల్గొన్నారు.



అన్నంపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

జోన్-2 జడ్సీ సింహాచలం



పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న దుకాణదారుడ్ని హెచ్చరిస్తున్న జడ్సీ సింహాచలం

మధురవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దుకాణాల నిర్వాహకులు పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని జోన్ 2 జోనల్ కమిషనర్ సింహాచలం హెచ్చరించారు. శనివారం ఆయన ఏడో వార్డు మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను పరిశీలించారు. ఒక దుకాణం ముందు గొయ్యిలో మురుగు నీరు ఉండడాన్ని గమనించి, దుకాణదారుడితో మాట్లాడారు.అపరిశుభ్రతమైన వాతావరణంలో దుకాణం ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రోడ్డు పక్కన తోపుడు బళ్లపై టిఫిన్లు, ఆహారం విక్రయించేవారు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో పాలిథిన్ కవర్లను గుర్తించిన జడ్సీ యజమానులను హెచ్చరించారు. కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ కిశోర్, ప్రజారోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నారసింహ సహస్ర నామావళి పఠనంతో తులసీ దళార్చన జరిపారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత వాహనంపై ఉంచి గరుడ సేవ చేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై స్వామివారిని ఉంచి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు.

గ్రామ కంఠం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పద్మనాభం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాందేవుపురంలో సర్వే నెంబరు 61లో ఉన్న గ్రామ కంఠం స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించినట్టు పంచాయతీ కార్యదర్శి బోని పైడయ్య పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందన దెందెటి పెద అప్పన్న, మరికొంతమంది గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించి, చుట్టూ సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోగులకు మెరుగైన సేవలు : డీఎంహెచ్ఓ

కొమ్మాది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన పీఎంపాలెంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సేవలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం చిన్నారులకు, గర్భిణిలకు జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలని, సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ నాగేశ్వరరావు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ జగదీశ్వరరావు

2 నుంచి లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

పద్మనాభం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కోరాడ పంచాయతీ గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో వచ్చేనెల 2 నుంచి కార్తీక మాసం పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటన విడుదల చేశారు. 1న సాయంత్రం ఆకాశ దీపంతో పూజలు ప్రారంభమవుతాయి. రెండు నుంచి డిసెంబరు 1 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం ఏకవార రుద్రాభిషేకం, 12న తొలి ఏకాదశి సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా లింగార్చన, జ్వాలా తోరణం, అఖండ దీపారాధన ఉంటుందన్నారు.

ప్రజలపై ఆర్థిక భారం మోపొద్దు : సీపీఐ

మధురవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీలు పేరుతో అదనపు భారం వేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 50 వేల కోట్ల రూపాయల భారం వేసిందని, కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో వెళుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తెరపైకి తెచ్చిందని చెప్పారు. స్మార్ట్ మీటర్ల వల్ల 17 వేల కోట్ల రూపాయలు ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. అలా కాకుండా మొండివైఖరిగా వ్యవహరిస్తే రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

'నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలి'

మధురవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మధురవాడ ఏరియా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కూరగాయలు ధరలతో పాటు వంట నూనెల ధర కూడా ఆకాశానికి అంటుతున్నాయని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరకులపై పన్నులు తగ్గించి, రాయితీల ద్వారా అధిక ధరలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంకే బేగం, బంగారయ్య, మహేశ్, రమణ, షేక్ మొహీన్ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ టీటీడీ ఆలయంలో లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

సాగర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి లడ్డూ విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. ఇకపై ప్రతిరోజూ లడ్డూ విక్రయాలు కొనసాగుతాయని ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. కాగా భక్తులు శనివారం స్వామి వారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

ఎండాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఐఐటీ చదువుతున్న బాడే భానుప్రకాశ్ (16) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విద్యార్థి స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా బొబ్బిలి. దసరా సెలవుల తరువాత రెండు రోజుల క్రితం కళాశాలకు వచ్చాడు. సాయంత్రం వాంతులు కావడంతో కళాశాల వసతి గృహం సిబ్బంది అతన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా విద్యార్థిని సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లకపోవడం వల్లే మృతి చెందాడని, మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

భీమిలిలో జీవీఎంసీ కమిషనర్ పర్యటన

భీమునిపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పట్టణంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా తీరంలో కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి, నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మార్కెట్ సముదాయం, గంట స్తంభం, క్రికెట్ స్టేడియం ప్రాంతాలను పరిశీలించారు. నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, 2వ వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, 1వ వార్డు టీడీపీ నాయకుడు గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సగంలో నిలిచిన పాఠశాల భవనం పనులు



రంగులు వేయకుండా ఉన్న గదులు

సింహాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాడు-నేడు నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 83 లక్షల నాడు-నేడు నిధులు మంజూరు చేసింది. వీటిలో రూ.61 లక్షలు విడుదల చేయడంతో 80 శాతం పనులు పూర్తయ్యాయి. మంజూరైన నిధులకు తోడు హెచ్‌ఎం సొంతంగా మరో రూ. 4 లక్షల ఖర్చు చేశారు. మిగిలిన రూ. 22 లక్షల విడుదలకు ప్రభుత్వం మార్పుతో అంతరాయం ఏర్పడింది. దీంతో గదుల నిర్మాణం నిలిచిపోయింది. గదులకు రంగులు వేయడం, భవనానికి ప్రొటెక్షన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా



మధురవాడ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మధురవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచరాదని సీపీఎం మధురవాడ జోన్ కమిటీ కార్యదర్శి డి. అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక రూపాల్లో పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం వేయడం తగదన్నారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచమని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి. రాజ్‌కుమార్, కె.నాగరాజు, ఎస్. పైడితల్లి, ఎ. గురుమూర్తిరెడ్డి, సీహెచ్ శేషుబాబు, డి. కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

తగరపువలస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి క్యాంపస్‌లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. విజయగనరం జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ డి. రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.అవంతి కళాశాలల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎన్ఎస్‌టీఎల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డా.వి.రామకృష్ణ ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చారు. సీనియర్ విద్యార్థులు ఆట పాటలతో జూనియర్లను ఆహ్వానించారు.

105 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తగరపువలస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంగివలసలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ శారదాంబ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శిబిరంలో 105 మందికి పరీక్షలు చేసి 39 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారిని సింహాచలం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. శిబిరాన్ని నేత్ర వైద్యులు రామచంద్రరాజు, శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సంస్థ వైద్యులు డా. శ్రీనిజ, ఆప్తమాలజీ విభాగం అధిపతి గంగాధర్, క్యాంపు కో ఆర్డినేటర్ వై. రాజు, సిబ్బంది విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలసలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి వాటర్ ట్యాంకు గొట్టాలకు క్లోరినేషన్ యూనిట్‌ను శనివారం అనుసంధానం చేశారు. గ్రామంలోని రాజులవీధిలో ఉన్న గొట్టాలకు మండల పంచాయతీ అధికారి రమేష్‌నాయుడు పైప్‌లను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ ప్రజలకు రక్షిత మంచినీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేస్తామని తెలిపారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 3 లక్షల విరాళం



ఈఓ త్రినాథరావుకు చెక్కు అందిస్తున్న దాత

సింహాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి ముగ్గురు దాతలు వేర్వేరుగా రూ. 3 లక్షల విరాళంగా సమర్పించారు. బెంగళూరుకు చెందిన కృష్ణ, కోమలి దంపతులు, గాజువాకలో చినగంట్యాడ ప్రాంతానికి చెందిన సీహెచ్ అప్పలనాయుడు, సూర్యకళ దంపతులు, కూర్మనపాలేనికి చెందిన సింహాద్రిబాబు, విజయలక్ష్మీ దంపతులు రూ.1,00,11 లక్షల చొప్పున చెక్కుల రూపంలో దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావుకు శనివారం విరాళాలు అందజేశారు.ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతలకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

జిమ్నాస్టిక్స్ పోటీల్లో రేవళ్లపాలెం క్రీడాకారుడి ప్రతిభ

కొమ్మాది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఈనెల 17, 18, 19వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో మధురవాడలోని రేవళ్లపాలెంకు చెందిన పిల్లా లక్ష్మీనారాయణ ప్రతిభ చూపాడు. ఈ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. ఈనెల 8 నుంచి 12 వరకు విశాఖలోని కోస్టల్ జిమ్నాస్టిక్స్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా సంస్థ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

అశ్రద్ధ చేస్తే.. ఆరోగ్యం గుల్ల

నడవాలంటే కాళ్లు సహకరించాలి. ఏ పనైనా చేయాలంటే చేతుల్లో శక్తి ఇమిడి ఉండాలి. నిలబడాలన్నా, కూర్చోవాలన్నా, వంగాలన్నా, అటూ ఇటూ తిరగాలన్నా వెన్నెముఖ సహకరించాలి. శరీరం ఎముకల గూడుతో నిర్మితం. వాటిని అనుకుని ఉన్న కండరాలతో కలిసి ఉన్నదే మనిషి సామర్థ్యం. ఓ నిర్మాణానికి ఇనుప చువ్వలు ఎలా ఆధారమో, శరీరానికి ఎముకలు అటువంటివి. ఎముకల్లో పటుత్వం తగ్గిందో మనిషి జీవనయానంలో సమస్యలు మొదలవుతాయి. దైనందిన కార్యక్రమాలు దారితప్పుతాయి. వయసు పైబడుతున్న కొద్దీ ఎముకల పటుత్వం తగ్గడం సహజం. కానీ అది అనూహ్యంగా జరగకుండా చూసుకోవడమే మన విధి. ఇందుకు జీవన శైలిలో మార్పులతోపాటు ఆహార నియమాలు, శారీరక శ్రమ వంటివి చాలా ముఖ్యం.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఎముక అంటే కేవలం ఓ గట్టి పదార్థం కాదు. దాని మజ్జలో ఉత్పత్తయ్యే ఎర్ర రక్తకణాలు శారీరక ఆరోగ్యం కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఎముక ఆరోగ్యం దెబ్బతినడం అంటే అది గుల్లబారడం. ఎముక ఓ గొట్టంలాంటి నిర్మాణం. దాని మధ్యలో ఉండేదే 'మజ్జ'. ఎముక గుల్ల బారడం అంటే ఈ మజ్జ తన సహజ సిద్ధమైన సామర్థ్యాన్ని కోల్పోతుందన్న మాట. ఎముకలకు ఎప్పటికప్పుడు అవసరమైన కాల్షియం, ఇతర పదార్థాలు సంతృప్తిగా అందినప్పుడే అది ఆరోగ్యంగా ఉంటుంది. మనిషి ఆహారం నుంచే ఇవి శరీరానికి అందాలి. ఒకప్పుడు 90 ఏళ్లు వచ్చినా ఎముకల పటుత్వానికి ఢోకా ఉండేది కాదు. ఇప్పుడు చిన్న వయసులోనే కాళ్లు, కీళ్లనొప్పులు భయపెడుతున్నాయి. ఇందుకు ఎముకల పటుత్వం దెబ్బతినడమే కారణం. ఎముకలకు కీలక శక్తినందించే ఆహారాన్ని తీసుకోకపోవడం, వాటి పటుత్వానికి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడం సమస్యకు మూలం. మనిషి స్వయంకృతం కారణంగానే ఎముకలు బలం కోల్పోతున్నాయంటున్నారు నిపుణులు. ఆదివారం అంతర్జాతీయ ఆస్టియో పొరోసిస్ (ఎముకలు గుల్లబారే) డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

వృద్ధాప్యంలోనే సమస్య ఎక్కువ

ఎముకలు గుల్లబారే సమస్య సాధారణంగా వృద్ధాప్యంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. గడచిన కొన్నేళ్లుగా యవ్వనంలో ఉన్న వారిలోనూ ఈ సమస్య తలెత్తుతోంది.

చిన్నవయసులోనే గుల్లబారుతున్న ఎముకలు

- కొందరిలో జన్యుపరమైన కారణాలతో సమస్య..
- పోషకాహారలోపం, శారీరక శ్రమ లేకపోవడం, కొన్ని రకాల మందుల వినియోగం వల్ల మరికొందరికి...
- సమస్య తెలిసిన వెంటనే జాగ్రత్తపడాలి
- తగిన చికిత్స తీసుకుంటే బయటపడే అవకాశం

నేడు అంతర్జాతీయ ఆస్టియో పోరోసిస్ డే

దీనికి అనేక కారణాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో హార్మోన్లు తగ్గిపోవడం వల్ల కాల్షియం పూర్తిగా తరిగిపోతోంది. దీనివల్ల ఎముకలన్నీ మెత్తబడి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. యవ్వనంలోను, చిన్నారుల్లోనూ ఈ సమస్య కనిపించడానికి ప్రత్యేక కారణాలున్నాయం టున్నారు. జన్యుపరమైన కారణాల వల్ల కొందరిలో ఈ సమస్య వస్తుంది. అనారోగ్యానికి వాడే మందులు వికటించినా సమస్య తలెత్తుతుంది. ఇతర కారణాలు కూడా ఇందుకు కొంత దోహదం చేస్తాయి. ముఖ్యంగా అస్తమా, కీళ్లవాతానికి వినియోగించే మందులు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాం టేషన్ జరిగిన రోగుల్లో ఈ సమస్య అధికంగా ఉందని, దీనికి వారు వినియోగించిన మందులే కారణమని నిపుణులు చెబుతున్నారు. దీన్నే డ్రగ్ ఇన్‌డ్యూస్డ్ ఆస్టియో పోరోసిస్ అంటారు. వీటితోపాటు కాల్షియం లోపం ఎక్కువగా ఉన్న వారిలోను, హార్మోన్స్ లోపం ఉన్నా, థైరాయిడ్ సమస్య ఉన్నా, ప్రమాదాలు, ఇతర అనారోగ్య కారణాల వల్ల ఎక్కువ రోజులపాటు విశ్రాంతి తీసుకున్నా ఈ సమస్య బారినపడే అవకాశం ఉంది.



సమస్య వస్తే ఇబ్బందులే?

ఎముకలు గుల్లబారితే చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎముకలు గుల్లబారడం అంటే వాటి సహజ సిద్ధమైన సామర్థ్యాన్ని కోల్పోవడం. అంటే గట్టిగా రాయిని తలపించేలా ఉండే ఎముకలు పుల్లల్లా మారిపోతాయి. దీనివల్ల చిన్న ప్రమాదం జరిగినా, ఏ కారణంగానైనా కింద పడినా ఎముకలు విరిగిపోతాయి. శరీరంలో కాల్షియంతో పాటు విటమిన్-డి తగ్గిపోవడం, థైరాయిడ్ గ్రంథి పనితీరు అతిగా ఉండడం, మధుమేహం బారినపడడం వంటి సమస్య లతోపాటు వయసు మీదపడినవారు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. నడుంనొప్పి, ఎత్తు తగ్గడం, ఎముకల్లో కదలికలు లేకపోవడం వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలుగా చెప్పొచ్చు.

మందులు, ఆహారం...

ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్ల) సమస్యతో బాధపడే వారికి కొన్ని రకాల మందులను ఇవ్వడం ద్వారా కొంత మెరుగైన ఫలితాలు సాధించవచ్చును. శరీరానికి అవసరమైన కాల్షియం టాబ్లెట్లు, ఇతర రూపాల్లో అందించాల్సి ఉంటుంది. కాల్సిటోనిన్ అనే హార్మోన్‌ను రోగులకు అందిస్తారు. బైపాస్‌నేట్ అనే కొన్ని రకాల మందులను ఇస్తారు. వీటితోపాటు విటమిన్ డి అందేందుకు ఎండ తగిలేలా చేయడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా చూడడం ద్వారా రోగి ఉపశమనం పొందేందుకు కృషి చేస్తారు. ముఖ్యంగా ఆహారంలో పాలు, యాపిల్స్, నట్స్, డ్రైఫ్రూట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

వ్యాయామం చేయాలి, పోషకాహారం తీసుకోవాలి



- డాక్టర్ శివానంద, ఆర్థో విభాగాధిపతి, కేజీహెచ్ సూపరింటెండెంట్

మహిళల్లో మెనోపాజ్ తరువాత, పురుషుల్లో 60 ఏళ్లు దాటితే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. వేరే జబ్బుల వల్ల కూడా ఆస్టియోపోరోసిస్ వస్తుంది. మల్టిబుల్ మైలోమా, కొన్ని బోన్ ట్యూమర్స్ వల్ల కూడా వస్తుంది. ఈస్ట్రోజన్ హార్మోన్ మహిళల్లో తగ్గిపోవడం వల్లే మెనోపాజ్ తరువాత ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల హిప్, స్పైన్, రిస్ట్ ఫ్యాక్చర్స్ ఎక్కువగా అవుతుంటాయి. కేజీహెచ్‌లోని ఆర్థో విభాగానికి ప్రతిరోజూ 300 కేసులు వస్తే అందులో ఆస్టియో పోరోసిస్ కేసులు 45 నుంచి 50 కేసులు ఇవే ఉంటున్నాయి. అందులో 30 మంది వరకు మహిళలు ఉంటున్నారు. ఈ సమస్యను నియంత్రించేందుకు వ్యాయామం చాలా అవసరం. అదే సమయంలో పోషకాహారాన్ని కూడా తీసుకోవాలి. వ్యాయామం లేకపోవడం, కూల్ డ్రింక్స్ అధికంగా తాగడం, గంటలు తరబడి కూర్చుని ఉండడం, పోషకాహార లేమి, సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ కాకపోవడం వంటివన్నీ భవిష్యత్తులో ఈ సమస్య బారినపడేందుకు కారణమవుతాయి.

యుక్త వయసులో కాల్షియం డిపాజిట్ అయ్యేలా చూసుకోవాలి

- డాక్టర్ భవానీప్రసాద్, ఆర్థో విభాగాధిపతి, విమ్స్



ఆహార లోపం, వ్యాయామం లేకపోవడం వల్ల వయసు పైబడిన వారిలో ఎముకల బలం తగ్గుతుంది. స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్లు ఉన్న వారిలో కూడా ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. స్టెరాయిడ్ మెడిసిన్స్ అధికంగా వినియోగించడం, కొన్ని రకాల వ్యాధులు కూడా సమస్యకు కారణం. ముందుజాగ్రత్త తీసుకోవడం చాలా ముఖ్యం. 14-15 ఏళ్ల వయసులో కాల్షియం డిపాజిట్ శరీరంలోకి బాగా జరగాలి. దీనివల్ల వయసు పైబడిన తరువాత ఇటువంటి సమస్యలు నుంచి ఉపశమనం పొందేందుకు అవకాశం ఉంటుంది. వ్యాయామం తప్పకుండా చేయాలి. వెన్నునొప్పి, ఎముకలు విరిగి వచ్చిన వారిలో ఆస్టియో పోరోసిస్ బాధితులే ఎక్కువగా ఉంటున్నారు.

విద్యా పర్యాటకంతో విజ్ఞానం.. వినోదం

మహారాణిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అన్ని వర్గాల వారికి చేరువ చేయాలనే సంకల్పం, ఆయా ప్రాంతాల విశిష్టత, విశేషాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మూడు సెక్టార్లలో విద్యా పర్యాటకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, తద్వారా వారికి విజ్ఞానం, వినోదం లభిస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ అన్నారు. విద్యా పర్యాటకంలో భాగంగా ప్రవేశపెట్టిన నూతన విధానానికి జిల్లా కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గాయత్రీ విద్యాపరిషత్, అగనంపూడిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో స్థానిక కలెక్టరేట్ నుంచి బయలుదేరిన పర్యాటక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం నిమిత్తం జిల్లాలోని వివిధ పర్యాటక కేంద్రాలను అనుసంధానం చేశామని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వారికి ఉచితంగానూ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు 10 రూపాయల కనీస రుసుముతో ప్రవేశ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మెరైన్ మ్యూజియం, సాగర తీరంలో ఉన్న సీ హారియర్ మ్యూజియం, టీయూ 167 ఐఎన్ఎస్ కురుసురా, సబ్‌మెరైన్, మారిటైమ్ మ్యూజియం, జూపార్కు, కంబాలకొండ, ఏయూలో జీవశాస్త్ర ప్రయోగశాల, మడ అడవులు, కేంద్ర మత్స్య పరిశోధన కేంద్ర సంగ్రహశాల వంటి వాటిని కూడా విద్యార్థులు సందర్శించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్ఞానవేణి, డీఈవో చంద్రకళ, సుబ్బిరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పచ్చజెండా ఊపి పర్యాటక బస్సులు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్

21 నుంచి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26 వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు డీఈఓ చంద్రకళ తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తగరపువలస సమీపంలోని మోదవలస ఆస్కార్ అంతర్జాతీయ పాఠశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులంతా శిక్షణకు హాజరుకావాలని చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తీరుపై కమిషనర్ అసంతృప్తి

ఆరిలోవ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ ప్రాంతంలోని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఖాళీ చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్‌రాజుతో కలసి మహావిశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం పరిశీలించారు. అన్ని విభాగాలు వ్యర్థాలతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. భవనానికి సంబంధించి సమగ్ర వివరాలు తనకు సమర్పించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా రాత్రి పూట సెక్యూరిటీ గార్డులను నియమించాలని జోన్-2 కమిషనర్ పి.సింహాచలాన్ని ఆదేశించారు. ఈ కేంద్రాన్ని సక్రమ పద్ధతిలో జీవీఎంసీకి అప్పగించని హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి లేఖ రాయాలని సూచించారు. ఈ భవనాన్ని తిరిగి వినియోగానికి వీలుగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజనీరు శాంసన్ రాజును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీహెచ్ దామోదరరావు, ఉప పర్యవేక్షక ఇంజనీరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.

అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం




బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ శనివారం ప్రారంభమైంది. ఏయూ సిల్వర్ జూబ్లీ బాస్కెట్‌బాల్ కోర్టులో జరుగుతున్న ఈ పోటీలకు ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగంలో రాణించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు వివిధ రూపాలలో ప్రోత్సాహం అందించేందుకు ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు చూపుతున్న ఆసక్తిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్ వర్సిటీల టోర్నీలలో ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు రోజువారీ భత్యాన్ని రూ.450లకు పెంచడం విశేషమని పేర్కొన్నారు. సౌత్‌జోన్, ఆలిండియా వర్సిటీ టోర్నీలో ప్రతిభ కనబరిచి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ బొజ్జా రామయ్య, డాక్టర్ వాసుదేవరాజు, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, ఎస్.గోపీకృష్ణ, గంగాభవాని, రామచందర్ పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లో అనిట్స్ కళాశాల 29-15 పాయింట్లతో గాయత్రి కళాశాలపై గెలుపొందింది.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. లక్ష విరాళం

విశాఖపట్నం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ జాలాది రవి శనివారం రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఈ సంఘం విజయవాడ వరదల సమయంలో సీఎం చంద్రబాబు చేపట్టిన సహాయ కార్యక్రమాలు వెల కట్టలేనివని పేర్కొంది. వరద బాధితుల సహాయార్థం ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసింది.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ప్రొఫెసర్ జాలాది రవి

క్రైం... crime news

వివాహితను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఎండాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి వివాహితకు చెందిన ఫోన్ నంబర్‌కి అసభ్యకర మెసేజ్‌లు పోస్టు చేస్తున్న యువకుడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. దీంతో విసుగు చెందిన ఆమె ఎందుకు కాల్స్ వస్తున్నాయని ఆరా తీస్తే ఒక ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో మహిళతో పాటు ఆమె భర్త ఫోన్ నెంబర్లు పెట్టడంతో తప్పుడు మెసేజ్‌లు రావడంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. సాంకేతికతను వినియోగించిన పోలీసులు అప్పలరాజుపురానికి చెందిన కోన యువరాజు (24) గా గుర్తించి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలలు సమయం ఇద్దామనుకున్నామన్నారు. అయితే ఢిల్లీ వెళ్లిన తర్వాత జమిలి ఎన్నికలు కారణంగా మూడేళ్లే ప్రభుత్వం ఉంటుందని చంద్రబాబునాయుడు చెబుతుండడంతో హామీల అమలుపై ప్రజల తరపున ప్రశ్నించాలని నిర్ణయించామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక అని ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం టన్ను రూ.1,500కి పెరిగిపోయిందన్నారు. మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏ రకం మద్యం రేట్లు తగ్గాయో చెప్పాలని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకున్నాసరే రైతుభరోసా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా నియంత్రణపై ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. విజయనగరం జిల్లా గుర్లలో మంచినీటి ట్యాంక్ నిర్వహణను గాలికి వదిలేయడంవల్లే డయేరియా ప్రబలి పది మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్రా హాస్పిటల్స్ హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే చారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయనున్నారు. ఆంధ్రా హాస్పిటల్స్ కార్డియాక్ టీమ్ ఇంగ్లండ్ నుంచి వచ్చి చిన్నారులకు ఆపరేషన్లు చేయనున్నందున గుండె జబ్బులతో బాధపడుతున్న పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రా హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ అండ్ డైరక్టర్ డాక్టర్ పీవీ రామారావు ఒక ప్రకటనలో కోరారు. పూర్తి సమాచారం కోసం 8886679 733, 0891-2724777 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఇప్పటివరకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఇలాంటి శిబిరాలను 30 వరకు విజయవంతంగా నిర్వహించి నాలుగు వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేశామని పేర్కొన్నారు.

రైల్లో బాణసంచా తరలిస్తే చర్యలు

- వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ హెచ్చరిక

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో బాణసంచా, పేలుడు, మండే వస్తువులు వంటివి రవాణా చేయడం నేరమని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు వెళ్లేవారు మ వెంట బాణసంచాను తీసుకెళ్లి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని, ప్రయాణికుల భద్రతకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని సూచించారు. నిషేధిత వస్తువులు తరలిస్తే మూడేళ్ల జైలు శిక్ష లేదా రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దీపావళి సందర్భంగా రైల్వే మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రత్యేక తనిఖీలు, నిరంతర నిఘా కొనసాగుతాయన్నారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై కూడా ఈ వస్తువులతో కనిపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కేవలం ప్రయాణికులనే కాకుండా పార్శిల్ సర్వీసు ద్వారా రవాణా అయ్యే లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. ఈ విషయమై వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో ప్రయాణికులకు సమగ్ర అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.